# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక



సంపుటి: 25 సంచిక: 11 హైదరాబాద్ 2026 మార్చి పేజీలు: 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-

# అవతారుని జన్మదినోత్సవం












## బాబావారిచ్చిన ఆఖరి జన్మదిన సందేశం

"నేను మీకు ఏదో ఇస్తానని నన్ను ప్రేమించడం సరికాదు. అది భగవంతుడ్ని ప్రేమించే విధానం కాదు. నా కోసం పనిచేయడం వల్ల నీవు లాభిస్తావని ఆశిస్తే, అది గ్రుడ్డివాడు మరొకరి చూపు కోసం తన కళ్ళను త్యాగం చేయడంలాంటిదని అన్నారు. నేను దైవీ ప్రేమమూర్తిని. దివ్య ప్రియతముడను. నన్ను ప్రేమించే వారికి నా ఆశీస్సులు లభిస్తాయి. నా నిజస్వరూపాన్ని దర్శించగల్గుతారు" అని మెహెర్‌బాబా తన సందేశంలో పేర్కొన్నారు.

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**శ్రీ దశిక ప్రసాదరావు**

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | చతుష్పాద ప్రేమికులు | 6-13 |
| 3. | భృగు సంహితలో | 14-17 |
| 4. | శ్రీ వేల్పుల నిరాకారరావు | 18-19 |
| 5. | లార్డ్ మెహెర్ | 20-24 |
| 6. | అవతారుని జన్మదినోత్సవాలు | 25-32 |
| 7. | భగవత్ప్రేమ | 33 |
| 8. | మా మాటలు | 34-35 |
| 9. | అవతార్ మెహెర్‌బాబా | 36-37 |
| 10. | మా ప్రచురణలు | 38 |
| 11. | చిత్రమాల | 39 |
| 16. | జీవితసభ్యులు | 40 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

ముఖ చిత్రం
జయానగర్, బెంగళూరు కేంద్రం

### మనవి

మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవల్సింది. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 26న హైదరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం.

# వెంకట్రావ్‌పేట కేంద్ర 30వ వార్షికోత్సవం

**మంచిర్యాల జిల్లా, వెంకట్రావ్‌పేట కేంద్ర 30వ వార్షికోత్సవం సందర్భంగా 2026 ఏప్రిల్** 18వ తేది మ. 1 గంట నుండి రాత్రి 9 గంటల వరకూ, తిరిగి ఏప్రిల్ 19వ తేది ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో హాజరు కావల్సిందిగా కేంద్ర నిర్వాహకులు కోరుతున్నారు.

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం 2026 ఫిబ్రవరి – మార్చి నెలలో**

1. శ్రీ అభిరాం, సికింద్రాబాద్ రూ. 1000/-
2. శ్రీ శ్రీనివాస్, ఇంజనీరు, కొవ్వూరు రూ. 1000/-
3. శ్రీ సన్యాసి రాజు, విశాఖపట్నం రూ. 2,000/-
4. శ్రీమతి పుష్పావతి, తాడేపల్లిగూడెం రూ. 3000/-
5. శ్రీమతి సునీత, బెంగళూరు రూ. 1000/-
6. శ్రీ కె.ఎం.రావు, హైదరాబాద్ రూ. 5000/- **పంపినారు.**

**వీరందరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా.**

# మెహెర్‌బాబా మండలి

## శరణాగతులైన ప్రేమికుల జీవిత చిత్రాల సమాహారం

**‘నాతో పాటు ఎన్నో సంవత్సరాలుగా వుంటూ, నా నుండి ఏమీ ఆశించని స్త్రీ, పురుష ప్రేమికులందరూ నా మండలి అన్నారు మెహెర్‌బాబా.**

**“నేను ఎవరి సాన్నిహిత్యాన్ని ఎక్కువగా కోరుకుంటానో వారందరూ నా మండలి” అన్నారు మెహెర్‌బాబా. అవతారునికి తమ సర్వస్వం అర్పించి, శరణాగతులై సేవలందించిన బాబావారి సన్నిహిత మండలి** అందరూ బాబాలో ఐక్యమయ్యారు. వీరి జీవితాలు బాబా ప్రేమ సందేశానికి ప్రతీకలు. మెహెరాబాద్ కొండపైన స్త్రీ మండలి, కొండ దిగువున పురుష మండలి వారి సమాధులు (60) వున్నాయి.

**ఆ అద్వితీయ భాగవతోత్తములకి నివాళిగా ‘మెహెర్‌బాబా మండలి’ పేరిట ఒక చిన్న పుస్తక ప్రచురణ చేపట్టాం. ఈ పుస్తకం గురించి మరిన్ని వివరాలు వచ్చే నెల సంచికలో తెలుసుకుందాం! అందాక జైబాబా.**

సంపాదకీయం

# ఆదర్శం కావాలి!

## ప్రతి పైసాకి లెక్క చెప్పాలి

**1958 ఫిబ్రవరిలో మెహెరాబాద్ సహవాస్ ముగిశాక జమా-ఖర్చులు వివరిస్తూ, మిగిలిన మొత్తాన్ని బాబా కేంద్ర కార్యదర్శుల పేరిట మనీ - ఆర్డరు పంపారు.**

**1958 ఫిబ్రవరి 14 నుండి 26 వరకూ అంటే రెండు వారాలు మెహెరాబాద్‌లో మహిళల కోసం** ప్రత్యేక సహవాస్ బాబా స్వయంగా నిర్వహించారు. ఫిబ్రవరి 14 నుండి 19 వరకూ హింది, మరాఠీ ప్రాంతీయులకు, ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ తెలుగు, గుజ రాతీయులకు సహవాస్ నిర్వహించారు. ఈ అవతారకాలంలో బాబా నిర్వహించిన సహవాస్ లలో ఇది చిట్టచివరిది అని బాబా ప్రకటించారు. ఈ సహవాస్‌లో బాబా ఎన్నో సందేశాలు ఇచ్చారు. ఈ సహవాస్ ప్రధానంగా మహిళల కోసమైనా మగవారిని కూడా అనుమతించారు. అప్పటికే బాబాకు రెండు కారు ప్రమాదాలు జరిగి, బాబా శరీరంలోని కుడి, ఎడమ పార్శ్వాలు బాగా దెబ్బతిన్నాయి. భౌతికంగా అవతారుడి ఆరోగ్య పరిస్థితి క్రీస్తుకి వేసిన శిలువతో సమానమన్నారు బాబా. 1958 ఫిబ్రవరి 25న బాబావారి 64వ జన్మదిన వేడుకలలో పాల్గొనే అవకాశం తెలుగువారికి చిక్కింది. అవతారుని చరణామృతాన్ని పొందగల్గే అవకాశమూ దొరికింది. అంతేకాదు, తెలుగు వారికి విజయవాడ వరకూ ప్రత్యేక రైలుని ఏర్పాటు చేశారు. మెహెరాబాద్‌లోనే ఆ ప్రత్యేక రైలు ఎక్కారు. బాబా తన స్త్రీ మండలితో కలిసి మెహెరాబాద్‌లో రైలు పట్టాల దాకా వచ్చి ప్రేమగావీడ్కోలు పలికారు.

**ఈ సహవాస్‌లో మొత్తం 750 మంది ప్రేమికులు హాజరయ్యారు. తలకు రూ. 30/-** చొప్పున భోజన, వసతి కోసం వసూలు చేశారు. తెలుగు వారికి ఇష్టమైన వంటకాలు ప్రత్యేకంగా చేయించారు. ఇందుకైన ఖర్చుని ఏరోజు కారోజు లెక్క రాయించారు. చివరిగా, ఆ వివరాలను ఒక సర్క్యులర్ ద్వారా తెలియజేశారు. **అ వివరాలు ఇలా వున్నాయి.**

**1). జమ అయిన మొత్తం నగదు రూ. 46,830/- 2). మొత్తం ఖర్చు రూ. 45,870/- 3). మిగిలిన నగదు రూ. 960/- అని లెక్క చెప్పారు. 4). మిగిలిన నగదుని, 12 బాబా కేంద్రాల నుండి వచ్చిన కేంద్ర కార్యదర్శుల పేరిట ఒక్కొక్కరికి రూ. 80/- చొప్పున బాబావారి కార్యదర్శి శ్రీ ఆది. కె. ఇరాని, మనీ - ఆర్డరు పంపారు. ఇదీ బాబా విధానం!**

***

**ఇదే మనం నేర్చుకోవల్సిన అసలైన పాఠం.**

# చతుష్పాద ప్రేమికులు



**చతుష్పాద జంతువులు కూడా బాబా మండలిలో వున్నాయి. నమ్మలేని నిజం ఇది.** నాలుగుకాళ్ళ జీవులను కూడా బాబా ప్రేమించారు. మండలి ప్రేమికులు ఎలాగైతే తమ సర్వస్వం అవతారునికి అర్పించి బాబా సన్నిధిలో జీవించారో, ఈ జంతుజాలం కూడా అంతే అంకితభావంతో, ప్రేమతో బాబాకు తమ సేవలందించి తరించాయని, మెహెరా మాయి అన్నారు. బాబా సన్నిధిలో తరించిన పెంపుడు జంతువులు గురించి తెలుసుకుందాం. ఎగువ మెహెరాబాద్‌లో బాబా సమాధికి చేరువలో, మర్రిచెట్టు నీడలో చతుష్పాదులకు చెందిన ఆరు సమాధులు కనపడతాయి. అందులో ఐదు సమాధులు ఐదు గ్రామ సింహాలవి కాగా, మరొకటి మన జాతీయ పక్షి, నెమలిది కావడం విశేషం. ఈ నెమలిని 'మోతీ' అని బాబా పిలిచేవారు. ఈ జాగిలాల పేర్లు వరుసగా 1. కిప్పీ 2. ఫొండీ 3. క్రాకర్ 4. ఛమ్ 5. వారియర్. ఇవికాకుండా బాబాని ప్రేమగా ఆరాధించిన పీటర్, మస్తాన్ అనే రెండు జాగిలాల సమాధులు మెహెరాజాద్ దవాఖానా ప్రాంగణంలో వున్నాయి. ఈ దఫా మెహెరాబాద్, మెహెరాజాద్‌లకు వెళ్ళి నప్పుడు ఈ మూగజీవుల సమాధులను తప్పక సందర్శించే ప్రయత్నం చేయండి. **మెహెరామాయి గ్రంథస్తం చేసిన 'మెహెర్‌బాబా లవ్డ్ అజ్ టూ'** గ్రంథం ఆధారంగా ఈ చతుష్పాద ప్రేమికుల సంబంధించిన సమాచారాన్ని సంక్షిప్తంగా తెలుసుకుందాం!

## మెహెరా మాయి ఏమన్నారంటే!

**బాబాతో అనేక జంతువులు వరుసగా పిల్లి (దాని పేరు పేగు), రామచిలుకలు, మైనాలు,** పక్షులు, కోతి, పంది పిల్లలు, తెల్ల గుర్రం (సూఫీ), తెల్లని గాడిద, తెల్లని కుందేళ్ళు, ఒక జింక, మేకలు, పాము – ముంగిస, రెండు ఇంగ్లీష్ పిల్ల ఎద్దులు, ఒక నక్క, ఇలా పలు జీవులు అవతారుని ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఒక ప్రత్యేక పాత్ర పోషించాయి. అవి పెంపుడు జంతువులు మాత్రమే కాదు. బాబావారి విశ్వాత్మక కార్యక్రమంలో పాల్గొన్న

ధన్యజీవులు. వీటి ద్వారా పరిణామక్రమంలో యావత్తు జంతు ప్రపంచానికి ఎనలేని లబ్ధి చేకూరింది. **అవతారుని సేవ, ప్రేమలో తరించిన ఈ మూగజీవాల గురించి ఒక్కొక్కరు ఒక్కో రీతిన ఏ మాత్రం స్పష్టత లేకుండా మాట్లాడుతున్నారు. ఇది అవాంఛనీయం.** స్పష్టమైన, సాధికారిక సమాచారాన్ని బాబా ప్రేమికులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. **ఈ ఉద్దేశ్యంతోనే MEHER BABA LOVED US TOO అనే శీర్షికతో ఇంగ్లీషులో చిన్న పుస్తకాన్ని** సంకలనం చేశామన్నారు మెహెరా మాయి. ఈ పుస్తకాన్ని అమెరికాలో వున్న షెరియార్ ప్రెస్ అందంగా ముద్రించింది. మండలి ప్రేమికుల మాదిరి ఈ జంతుజాలం కూడా బాబాకు ఎనలేని సేవలందించి తరించాయని మెహెరా ఈ పుస్తకంలో పేర్కొన్నారు. అరుదైన సమాచారాన్ని అందజేసే 175 పేజీలు గల ఈ చిన్ని పుస్తకాన్ని బాబా ప్రేమికులు తప్పక చదవవల్సింది. **కాగా, ఆ వివరాలు ఇలా వున్నాయి.**

## కిప్పీ

**ఇది బోస్టన్ టెర్రియర్ జాతి శునకం. దీని పేరు కిప్పీ. 1936లో తొలిసారిగా అమెరికా** నుండి ఎలిజబెత్ ప్యాటర్‌సన్‌తో కలిసి బాబావారి నాసిక్ ఆశ్రమానికి వచ్చింది.ఆ తర్వాత బాబా బృందంతో కలిసి పాశ్చాత్య దేశ యాత్రలో పాల్గొనింది. అలాగే, బాబా బృందంతో బ్లూ బస్ పర్యటనల్లోనూ కిప్పీ పాల్గొనింది. 1938లో కిప్పీ పుట్టినరోజు పండుగని మెహెరాబాద్‌లో బాబా ఎంతో వేడుకగా జరిపించారు. బాబాను ఎంతగానో సేవించిన ఈ శునకం, 1941లో అమెరికాలో తనువు చాలించింది. బాబా ఆదేశాల మేరకు కిప్పీ సమాధిని మెహెరాబాద్‌లో ఏర్పాటు చేశారు. కాంశ్య ఫలకంతో కిప్పీ సమాధిని మండలి సభ్యులు చాలా ప్రత్యేకంగా నిర్మించారు.

## ఛమ్

**1930వ దశకంలో బాబా మెహెరాబాద్ కొండపై ఉండగా నవజాత శిశువుగా ఈ శునకం** బాబా దరి చేరింది. బాబా దగ్గరికి చేరే సమయానికి ఛమ్ వయస్సు కేవలం ఒక నెల రోజులు మాత్రమే. అలా అవతారుని సమక్షంలో పెరిగి పెద్దదై తన జీవితకాల మంతా అవతారుని నీడలో పెరిగింది. బాబా ఎంతగానో ఇష్టపడే ఛమ్, మెహెరాబాద్‌లో అవతారుడు ఏకాంతవాసంలో వుండగా, ఆ దరిదాపులకి ఎవరనీ రానీయకుండా, గట్టి కాపలా ఉండేది. ఒకరోజున బాబా సోదరి మణిని కూడా అడ్డుకునేసరికి అవతారుని ఆగ్రహానికి గురయ్యాడు ఛుం అని మెహెరా పేర్కొన్నారు. అవతారుని దగ్గర మసుల ుకునే రీతిపై మెహెరా స్వయంగా ఛమ్‌కి తగిన శిక్షణ ఇచ్చింది. బ్లూ బస్ యాత్ర ప్రారంభమయ్యే వరకూ ఛమ్ అవతారుని సమక్షంలో మెహెరాబాద్ కొండపైనే వుంది.

## వారియర్

**ఈ కుక్కపిల్ల అల్సేషియన్ జాతికి చెందినది. దీని పేరు వారియర్. అంటే తెలుగులో** యోధాను యోధుడని సమానార్థంగా చెప్పొచ్చు. 1940లో మెహెరాశ్రమం, మెహెరాబాద్‌కి వచ్చింది. ఎలిజబెత్ ప్యాటర్‌సన్‌కి శునకాలపట్ల అమితమైన వాత్సల్యం ఉండేది. అందుకే ఆమెకు ఈ కుక్కపిల్ల సంరక్షణ బాధ్యతను బాబా అప్పగించారు. ఆ ఏడాది బాబా మెహెరాబాద్ కొండపై ఏకాంతవాసం ఉన్నప్పుడు, ఈ అల్సేషియన్‌తో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాబా స్వయంగా తన స్వహస్తాలతో ఈ శునకానికి ఆహారం పెట్టేవారు. బాబావారి ఆధ్యాత్మిక కార్యక్రమం ముగిశాక, వారియర్‌ని స్త్రీ మండలికి అప్పగించారు. ఐతే, ఆ పిదప వారియర్ అనారోగ్యానికి గురయ్యాడు. పశువైద్యులు పరీక్షించి మందులు ఇచ్చినా లాభం లేకుండింది.ఆ ఏడాది సెప్టెంబర్ చివరలో వారియర్ తనువు చాలించాడు. వారియర్‌ను ఖననం చేయవలసిన స్థలాన్ని అవతారుడు స్వయంగా ఎంపిక చేశారు. వారియర్ మరణంతో విచార వదనంతో వున్న ఎలిజబెత్‌తో బాబా ఇలా అన్నారు.

**మీకు తెలుసు కదా..“వారియర్ నాకు చెందినది. వాస్తవానికి వారియర్ కేవలం ఒక శునకం కాదు.** నా ఆధ్యాత్మిక కార్యక్రమం కోసం తాత్కాలికంగా స్పిరిట్ వరల్డ్ (ఆత్మ ప్రపంచం) నుండి భువికి తీసుకు రాబడ్డాడు”. వారియర్‌కు మరిక జన్మలు లేవు. స్వేచ్ఛా జీవి అయ్యాడని బాబా ప్రకటించారు. ‘అవతారుడు తన ఆధ్యాత్మిక కార్యక్రమం కోసం **ఆత్మ ప్రపంచం** నుండి ఒక ఆత్మను తీసుకువచ్చి, దానికి ఒక రూపాన్ని ఇచ్చి, దానితో తన కార్యక్రమం పూర్తికాగానే, ఆ జీవికి స్వేచ్ఛను ప్రసాదించాడు”, వారియర్ ధన్యజీవి అని మెహెరా ఉటంకించారు.

## మోతి

**మన జాతీయ పక్షి నెమలి. బాబా ఆశ్రమంలో నెమలి తన సొగసైన నడకతో నృత్యం చేస్తూ** బాబావారిని, మండలిని అలరించింది. ఈ నెమలికి ‘మోతి’ అని పేరు పెట్టారు బాబా. 1939లో బెంగళూరు నుండి బాబా ఆశ్రమానికి వచ్చింది. రంగురంగుల మేళవింపుతో కనువిందు చేసింది మోతి. ఇంతకీ ఈ మోతి మెహెరాశ్రమానికి ఎలా వచ్చిందన్న వైనం పాఠకులు తప్పక తెలుసుకోవాలి. ఆ రోజుల్లో బాబా లింక్స్ అనే బంగళాలో బెంగళూరులో ఉండేవారని తెలుసు కదా. పాశ్చాత్య ప్రేమికురాలు ఎలిజెబెత్ పాటర్‌సన్ ఒక రోజున బెంగళూరు నగరంలో ఏవో కొనుగోళ్ళకై వెళ్ళినప్పుడు చిన్న నెమలి పిల్ల ఆమెని ఎంతగానో ఆకర్షించింది. తిరిగి ఆశ్రమానికి వచ్చాక, ఈ విషయం బాబాతో చెప్పకుండా ఉండలేక పోయింది. బాబాతో తాను చూసిన అందమైన పక్షి గురించి చెప్పి, బాబా అనుమతితో

ఆ మయూరాన్ని ఆశ్రమానికి తీసుకువచ్చింది. ఈ పక్షికి ముద్దుగా మోతి అని పేరు పెట్టారు అవతారుడు. **సంధ్యా సమయంలో 'మోతి చేసే' నృత్యాభినయాన్ని చూడ్డానికి రెండు కళ్ళు చాలవంటుంది మెహెరా మాయి.**

## FOUNDY

**ఇది దొరికిన శునకం. అందుకే బాబా ఈ కుక్కకి ఫౌండీ అని ఇంగ్లీషులో పేరుపెట్టారు.** ఈ జాగిలం ఎలా దొరికిందో తెలుసుకుందాం క్లుప్తంగా, బాబా బృందం క్వెట్టా నుండి రైల్లో మెహెరాబాద్‌కి తిరుగు ప్రయాణంలో వున్నారు. క్వెట్టా రైల్వేస్టేషన్‌లో ఆగి వున్న రైల్లో ప్రతి బోగిలో తన యజమాని కోసం వెదుకుతూ ఈ శునకం పరిగెడుతోంది. ఈ శునకం యొక్క యజమాని ఒక మిలిటరీ అధికారి. ఐతే, అతను వేరేచోటకి బదిలీపై వెడుతూ, ఈ శునకం బాధ్యతని ఆ రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక స్నేహితుడికి అప్పగించి వెళ్ళాడు. ఎన్నాళ్ళైనా తన యజమానిని మరచిపోలేని ఈ జాగిలం, ప్రతిరోజూ రైల్వే స్టేషన్‌కు వచ్చీ పోయే రైళ్ళలో, తన యజమాని కోసం ప్రతి బోగీలో వెదుక్కునేది.

**ఇది గమనించిన ఎలిజెబెత్ పాటర్‌సన్ స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్‌తో వాకబు చేస్తే, ఈ** విషయం తెలిసింది. దాంతో సున్నిత మనస్కురాలైన ఎలిజబెత్, అవతారుని అనుమతితో, క్వెట్టా నుండి మెహెరాశ్రమానికి తీసుకువచ్చింది. అలా వచ్చిన జాగిలానికి బాబా ఫౌండీ అని పేరుపెట్టారు. ఎలిజెబెత్ తన దగ్గర అప్పటికే వున్న కిప్పీతోపాటు ఫౌండీ బాధ్యతలు కూడా చేపట్టింది. రెండవ ప్రపంచ యద్ధ సమయంలో ఆమె అమెరికా తిరిగి వెళ్తూ, ఫౌండీ, కిప్పీలను కూడా తనతో తీసుకెళ్ళింది.

**ఆ తర్వాత, 1946లో బాబావారి ఆదేశాల మేరకు అమెరికా నుండి మెహెరాశ్రమానికి** వచ్చిన ఎలిజెబెత్ వెంట ఫౌండీ కూడా వచ్చింది. ఐతే, అప్పటికే ఫౌండీ జీవిత చరమాంకంలో వుంది. కంటి చూపు మందగించింది. **1948 జనవరిలో ఒకరోజున ఎలిజెబెత్ విచారంగా ఉండటం చూసి ఏమయ్యిందని** బాబా అడిగారు. 'ఫౌండీ' చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతోందని, అందుకే ఏడుపు వస్తోందని ఆమె బాబాకు చెప్పింది.

**ఓ అలాగా! బెంగపడొద్దని బాబా భరోసా ఇస్తూ, మహాత్మా గాంధీ కంటే మరో రెండ్రోజులు** ఎక్కువే రోజులే ఫౌండీ బ్రతుకుతుందని బాబా ఆమెను ఓదార్చారు.

ఇది జరిగిన మర్నాడే ఢిల్లీలో గాంధీజీని హత్యచేశారు. ఆ దరిమిలా సరిగ్గా రెండ్రోజులకు ఫౌండీ కూడా తనువు చాలించింది!

## క్రాకర్

**మస్తులతో బాబా కార్యక్రమం ముగించుకుని ఢిల్లీ నుండి డెహ్రాడూన్‌కి వస్తూ, స్కాటిష్**

టెంపర్‌మెంట్ గల చిన్న కుక్క పిల్లని బాబా తన వెంట తీసుకువచ్చారు. ఇలాంటి కుక్క పిల్ల కోసం స్త్రీ మండలి చాలాకాలంగా వెదుకుతోంది కానీ సాధ్యమవలేదని మెహెరా అన్నారు. ఈ కుక్కపిల్ల యజమాని దీనికి క్రాకర్ అని పేరు పెట్టాడు. బాబా కూడా ఆ పేరునే కొనిసాగించారు. ఆ పేరుకు తగ్గట్టుగానే దీపావళి బాణాసంచాలాగా గొప్ప దుందుడుకు స్వభావం గలవాడు క్రాకర్. ఐతే, చాలా ప్రేమగా ఉంటాడని మెహెరా కితాబిచ్చారు ఈ శునకానికి. బాబా సోదరి మణికి క్రాకర్ ఆలనా పాలనా అప్పగి ంచారు. మెహెరాజాద్‌లాంటి ప్రాంతంలో క్రాకర్‌కు తగిన స్వేచ్ఛ లేదని చెప్పి, క్రాకర్‌ని మెహెరాబాద్‌కు పంపారు. అక్కడ మెహెరాశ్రమంలో వున్న కిట్టీ దేవికి క్రాకర్‌ని అప్పగించారు.

## పీటర్

**1953లో బాబా బృందం డెహ్రాడూన్‌కి సమీపంలోని** ముస్సోరీలో ఉండగా అక్కడికి దగ్గర్లో ఉండేవారొకరు చిన్న కుక్కపిల్లను మెహెరా – మణిలకు బహుమతిగా ఇచ్చారు. ఈ కుక్క పిల్లకు పీటర్ అని బాబా పేరు పెట్టారు. అప్పటి నుంచి సుమారు 12 సంవత్సరాలు బాబా సమక్షంలో, ఆయన పాదాల వద్ద 1965లో మరణించే వరకు పీటర్ మెహెరాజాద్‌లోనే అవతారునికి ఎనలేని సేవలు అందజేశాడు. పీటర్ బాగోగుల్ని సోదరి మణిజా చూసుకునేది. పీటర్ మరణించినప్పుడు బాబా ఇలా అన్నారు. **“నా ఈ అవతార కాలంలో ఏదైనా జంతువు నా భౌతిక సమక్షంలో మరణించడం ఇదే మొదటిసారి. పీటర్ ధన్యుడు అని బాబా ప్రకటించారు. ఇప్పటి నుండి ఒక సంవత్సరం తర్వాత, పీటర్ మానవ రూపంలో బాలుడిగా జన్మిస్తాడని అన్నారు. అంతేకాదు, చిన్నారి శిశువుగా వచ్చి నా ఆలింగనం పొందుతాడనీ అన్నారు’.** పీటర్ పార్థివ దేహంపై బాబావారి చేతి రుమాల వుంచారు. అనంతరం, మెహెరాజాద్‌లో వున్న దవాఖానాకు దగ్గరలో సమాధి చేశారు.

## రమ్ముాజి

**పీటర్ మరణించాక మెహెరాజాద్‌లో తిరుగాడుతున్న ఒక చిన్న కుక్క పిల్ల పురుష మండలికి** మచ్చికయ్యింది. ఈ కుక్క పిల్లకి రమ్ము అని పేరుపెట్టారు. **‘రమ్ము’** అనేది గుజరాతీ పదం. ఇందుకు తెలుగులో సమానార్థంగా **‘ఆడుకుందాం’** అని చెప్పొచ్చు. మెహెరాజాద్ మండలి హాలులో బాబా రమ్ముాతో పలు సందర్భాలలో ఉత్సాహంగా ఆటలు ఆడి సేద తీరారు.

1967–1968 నడుమ ఏకాంతవాసంలో వుండి కూడా, బాబా రమ్ముతో కొంతసేపు గడిపారు. ఇందువల్ల తనకెంతో ఉపశమనం కలుగుతుందని అవతారుడు పలు



సందర్భాలలో అన్నారు. 1975లో తుదిశ్వాస వదిలిన రమ్మి సమాధిని, మెహెరాజాద్‌లో పీటర్ సమాధికి దగ్గర్లోనే ఏర్పాటు చేశారు.

## మస్తాన్

**అమితమైన బాబా ప్రేమను పొందిన ధన్యుడు మస్తాన్. మెహెరాజాద్‌లో బాబా** దగ్గరున్న 'భూతి'అనే జాగిలం ప్రసవంలో చిన్న కుక్క పిల్లలకు జన్మనిస్తే, భూతిలాగా వున్న కుక్కపిల్ల నొకదాన్ని పూణే గురుప్రసాద్‌కి తీసుకురమ్మనమని మండలి సభ్యుడైన కాకా బారియాకు బాబా చెప్పారు. ఆ సమయంలో బాబా గురుప్రసాద్‌లో వున్నారు. ఆ మాదిరిగా కాకా చిన్న శిశువుని తీసుకువెడితే, దాన్ని ప్రేమగా లాలించి, బాబా ఆ పప్పీకి మస్తాన్ అని పేరుపెట్టారు. మస్తాన్ బాగోగుల్ని మెహెరాకు అప్పగించారు. పీటర్ బాధ్యత మణిజాకు అప్పగించిన సంగతి తెలుసు కదా! **తదాదిగా పీటర్ - మస్తాన్‌ల నడుమ విడదీయరాని స్నేహబంధం ఏర్పడింది. మస్తాన్‌కు** బాబా స్వయంగా ఆహారం తినిపించేవారు. ప్రేమగా లాలించేవారు. పూణే వేసవి విడిది తర్వాత మెహెరాజాద్‌కి వెళ్ళగానే, తన కోసం ఎదురు చూస్తున్న పీటర్ - మస్తాన్‌లను మండలి హాల్లోకి పిలిపించి, వాటిని ముద్దాడి కానీ బాబా తన గదికి వెళ్ళేవారు కాదని, మెహెరా ఆనాటి

జ్ఞాపకాలుగా చెప్తుంది. బాబాకి జరిగిన కారు ప్రమాదం తర్వాత కూడా బాబావారు ఈ జాగిలాలతో కొంత సమయం గడిపేవారని, మెహెరా అన్నారు.

**మస్తాన్ బాబాని ఎంతగా ప్రేమించేవారంటే, బాబా భౌతిక దేహం వదిలిపెట్టాక, ఒకరోజున** మస్తాన్ బాబా గదికి నేరుగా వచ్చింది. బాబా మంచం చుట్టూ తిరిగింది. ఇక బాబా లేరని తెలుసుకుని చాలా రోజులు అన్నపానాదులు ముట్టలేదు. క్రమేణా నీరసించి, బలహీనమయ్యాడు. గురుప్రసాద్‌లో ఏర్పాటు చేసిన మహా దర్శన కార్యక్రమానికి హాజరైన మండలి వారందరూ తిరిగి వచ్చాక, మస్తాన్ తుదిశ్వాస వదిలాడు.

**మస్తాన్‌కి మానవ జన్మ లభిస్తుందని బాబా పలు సందర్భాలలో ప్రకటించారు. మస్తాన్ సమాధి కూడా మెహెరాజాద్ దవాఖానాకు సమీపంలోనే ఏర్పాటు చేశారు.** *

# ఇదీ సృష్టి విచిత్రమంటే

**– మెహెర్‌బాబా**

**నీ దర్శనమే నే కోరుకొన్నా అంటూ దేవుడి కోసం ప్రార్థన చేసే మనిషి,**
**దేవ దేముడే తమ కళ్ళ ముందు వెడుతుంటే గుర్తించలేక పోయాడు.**
**ఇదీ సృష్టి విచిత్రమంటే.**

**అయినా, మన భ్రమ కానీ పరబ్రహ్మ దర్శనం అంత సులువుగా దొరుకుతుందా ఎవరికైనా.** ఎన్ని జన్మలు ఎత్తాలి. ఎంత తపస్సు చేయాలి. నీవే తప్ప నాకు దిక్కు ఎవరు అంటూ ఎంతగా దీనాలాపన చేయాలి. అప్పుడే కదా పరాత్పరుడు కరుణించేది. దర్శన భాగ్యం ప్రసాదించేది. పరాత్పరుడు విశ్వ సామ్రాట్.

**ప్రభువు దర్శనం కోసం పరితపించే సాధకులు బిక్షుకులు. ప్రభువు కొలువులో ఎప్పుడూ** వుంటారు బిక్షుకులు. వాళ్ళ విన్నపం వొక్కటే – మాకు దివ్యశక్తులు వద్దు. సంస్కారాల భారం తగ్గించు. ఇదే పదివేల వరహాలు. దేవదేవునికి బానిసలమై మాయ పొర నుంచి బయటపడాలన్నదే వాళ్ళ తహతహ. అవతారుడికి ఇటువంటి బిక్షుకులే కావాలి. వాళ్ళ కోసం వెతుకుతూ వుంటారు. వాళ్ళని తనవాళ్ళుగా చేసుకొంటారు. వాళ్ళ మధ్యనే వుంటారు ఎప్పుడూ. సమయం వచ్చినప్పుడు తన నిజరూప దర్శనం ప్రసాదిస్తారు. ఇదిగో, ఇప్పుడు ఈ నవయుగంలో అటువంటి శుభ తరుణం ఆసన్నమయింది. *

# సర్వభూతాంతరాత్మ

**సకల పాణుల హృదయాల్లో నివసించే సర్వాంతర్యామి – మెహెర్‌బాబా**

► చిన్న చీమలు, పురుగులులాంటి వాటికి కూడా హాని కలిగించవద్దనే వారు బాబా. తెలియక తప్పు జరిగితే పరవాలేదు. తెలిసి తప్పుచేయవద్దని హెచ్చరించేవారు. బోనులో పడిన ఎలుకల్ని రెండు మైళ్ళ ఆవతల స్వేచ్ఛగా వదలమనేవారు. బల్లులను చంపకుండా, గుడ్డలో పట్టి దూరంగా వదలమనేవారు. అలాగే ఏమైనా జబ్బు పడిన పక్షులు, చిన్న కుందేళ్ళు, గాయాలపాలైన శునకాలను నాజాకు అప్పగించి సపర్యలు చేయమనేవారు.

► బాబా డెహ్రాడూన్‌లో వుండగా ఒకరు ఒక ఆడ గుర్రాన్ని బాబాకు బహుమతిగా ఇచ్చారు. దానికి షేబా అని పేరు పెట్టారు బాబా. రెండు మూడేళ్ళు షేబా బాబాతో వుంది. ఆ తర్వాత దీంతో నా కార్యక్రమం పూర్తయింది, షేబాని సరోష్ ఇరానీకి ఇచ్చి నీవు పెంచుకో లేదా ఎవరికైనా మంచివారికి ఇచ్చేయమన్నారు.

► సరోష్ ఇరానీ బాబా తనకు రెండు ఆవు దూడలు కావాలన్నారు. అవి ఇంగ్లీషు జాతివై వుండాలన్నారు. చాలా కష్టపడి వెదికి బాబా చెప్పిన టైంకి వాటిని అందజేశాను. బాబా సంతోషించారు. నాకు ఆలింగనం ఇచ్చారు. ఇదిఇలావుంటే, పశుపక్షపాతి ఎలిజెబెత్ పాటర్‌సన్ బాబాతో “మనం పందులను” కూడా పెంచితే బాగుంటుంది అంది. దాంతో ఆ పనికూడా చేశామని, తన జ్ఞాపకాన్ని చెప్పాడు సరోష్ ఇరాని.

► ఒకసారి బాబా తనను గుర్తించగల కోతిపిల్ల కావాలన్నారు. పంజరాలలో కోతిపిల్లల ను తీసుకొచ్చి బాబా ఎదుట విప్పితే అవి గెంతుకుంటూ వెళ్ళిపోయేవి. ఐతే ఒక చిన్న కోతిపిల్ల మాత్రం ఎగిరి గంతేసి బాబా ఒడిని చేరింది. కొన్ని వారాలు బాబాని విడిచి అది ఉండలేదు. ఆ మర్కటం బాగోగుల్ని నోరినా మ్యాచ్‌బెల్లికి అప్పగించారు. అది తమ గదిలోకి వచ్చి వస్తువులన్నీ చిందరవందర చేసి గోల చేసేదని నోరి నా చెప్తుంది. ఇదొక రకంగా ఆచరణాత్మక ఆధ్యాత్మికత అలవాటు చేశారు బాబా అంటుంది నోరినా. చివరికి ఒకరోజున దూరంగా అడవిలో విడిచిపెట్టించారు.

► ప్రకృతిలోని సమస్త జీవజాలం మీద బాబాకు ప్రేమ వుండింది. వానపాములు, మరి ఇతర పురుగుల మీద కాలు పడకుండా జాగ్రత్తగా వుండమనేవారు. ఈ జీవులన్నీ అవతారుని దివ్య కార్యక్రమంలో భాగస్వాములు.

► బాబా సమక్షంలో ప్రాణాలు విడిచిన ఏ జంతువైనా, పక్షియైనా మధ్యలో వుండే భౌతిక శరీరాలను అధిగమించి, మనిషిగా జన్మ లభిస్తుందని బాబా చెప్పారు. *

పునర్ముద్రణ

# భృగుసంహితలో మెహెర్‌బాబా

**సేకరణ**

**శ్రీ రెంటాల సూర్యనారాయణమూర్తి, నిజామాబాద్**
**శ్రీ బి. పురుషోత్తమరావు,**
**శ్రీ పి. గణపతిరావు, హైదరాబాద్**



**మెహెర్‌బాబా జన్మదిన సందర్భంగా 1962 ఫిబ్రవరి 25వ తేదీన అహమ్మద్‌నగర్ నుండి** ప్రచురిస్తున్న **"చేతక్ లోకమత్"** అనే మరాఠీ వారపత్రిక భృగు మహర్షి 4000 సంవత్సరాల క్రితం మెహెర్‌బాబా గురించి వ్రాసిన జాతక వివరాలను ప్రచురించింది.

**ఈ మరాఠీ పత్రిక శ్రీ రెంటాల సూర్యనారాయణమూర్తి, నిజామాబాద్ వద్ద వుంటే** తీసుకుని 1973లో శ్రీ బి. పురుషోత్తమరావు అందులోని అంశాలను ఇంగ్లీషులోకి అనువదించారు. ఆ పిదప, శ్రీ పి. గణపతిరావు, హైదరాబాద్ ఈ అంశాలను తెలుగు పాఠకలోకం కోసం తెలుగులో తర్జుమాచేసి, మెహెర్‌బాబా పత్రికలో ప్రచురణ కోసం పంపారు. మెహెర్‌బాబావారి 110వ జన్మదినోత్సవ సందర్భంగా 2004 మార్చి నెలలో మెహెర్‌బాబా పత్రికలో భృగుసంహితలో మెహెర్‌బాబా జాతకం శీర్షికన ప్రచురించాం.

**గమ్మత్తు ఏమంటే, ఆనాటి మరాఠీ పత్రిక ఇచ్చిన శ్రీ రెంటాల సూర్యనారాయణమూర్తి,** ఇంగ్లీషులో అనువదించిన శ్రీ బి. పురుషోత్తమరావు, తెనుగీకరించిన శ్రీ పి. గణపతిరావు, ఇలా ఈ ముగ్గురూ తదనంతరం అనేకమంది ప్రేమిక పాఠకులు బాబాలో ఐక్యమయ్యారు. కాబట్టి, ఈ తరం పాఠకులలో ఆసక్తిగలవారి కోసం ఈ వ్యాసాన్ని పునర్ముద్రిస్తున్నాం. మీ స్పందన తెలియజేయగలరు.

**1940 ప్రాంతంలో ముంబాయిలో ఒక మెహెర్‌బాబా భక్తుడు శ్రీ గోవింద జనార్దన్ బోర్కర్** అనే జ్యోతిష్కునికి మెహెర్‌బాబా పుట్టినరోజు, సమయం మాత్రం ఇచ్చి బాబా జాతకం గురించి అడిగితే, భృగు మహర్షి 4000 సంవత్సరాల క్రితమే వ్రాసిన 'భృగు సంహిత' గ్రంథం ఆధారంగా మెహెర్‌బాబా జాతకం వ్రాసి 1941 మేలో శ్రీ బోర్కర్ మెహెర్‌బాబా ప్రేమికునికి అందజేశారు. ఈ జాతకంలోని వివరాలను 1940వ దశకంలో బాబా మండలి ప్రచురిస్తున్న **"మెహెర్‌బాబా జర్నల్"లో** ప్రముఖంగా ప్రచురించారు.

# భృగు మహర్షి – 'భృగు సంహిత'

**భృగు మహర్షి నర్మదా నదీతీరంలో నివసించాడు. భృగు మహర్షి నివసించిన ప్రాంతాన్నే** నేడు 'భరోచ్' అని పిలుస్తున్నారు. మనదేశంలోగల అత్యంత పురాతన నగరాలలో భరోచ్ రెండవ చారిత్రక పట్టణంగా నిలుస్తోంది. కాగా, మొదటి పురాతన పట్టణం వారణాసిగా పేర్కొన్నారు.

**జ్యోతిష్యం ఆవిర్భావానికి ఆద్యుడు భృగు మహర్షి. వేదకాలానికి చెందిన భృగు మహర్షిని** హైందవ జ్యోతిష్య శాస్త్ర పితామహుడుగా కీర్తిస్తారు. ఆయన వ్రాసి 'భృగు సంహిత' అనే గ్రంథంలో సృష్టిలోని దాదాపు అన్ని జీవరాశుల జాతకాలను భృగు మహర్షి రాశాడు. ఈ ఉద్గ్రంథంలో ఈ భూమ్మీద జన్మించిన ప్రతిజీవి గురించి, వారి భూత, భవిష్యత్తు, వర్తమానాల గురించి క్షుణ్ణంగా సంస్కృత భాషలో భృగు మహర్షి వ్రాశాడు. భృగు మహర్షి 'త్రికాల జ్ఞానిగా, ధర్మశాస్త్ర ప్రవక్తగా కీర్తిగడించాడు.

నేడు 'భృగు సంహిత' గ్రంథంలోని అనేక పుటలు పలు ప్రాంతాల్లో ఉన్నట్టు, కొంతభాగం ఉత్తరప్రదేశ్‌లోని 'మీరట్' లో లభించాయని పేర్కొంటారు.

**'భృగు సంహిత'లో మెహెర్‌బాబా జాతకం సంఖ్య 299–300లో పేర్కొన్నారు. మెహెర్‌బాబా** జీవితం గురించి ఆ తాళపత్రాలలో భృగు మహర్షి చెప్పినవన్నీ అక్షర సత్యాలయ్యాయని పరిశోధకుల అభిప్రాయం.

## భృగు మహర్షి ఏం చెప్పారంటే!

ఈ జాతకుని నక్షత్ర బలం ప్రకారం ఆనందమైన జీవితాన్ని గడుపుతూ, తన కుటుంబానికి తగిన సహాయాన్ని అందిస్తాడు. ఎన్నో ఘన కార్యాలు చేస్తాడు. ఇతను యోగస్థితిని అందుకుంటాడు. యోగ స్థితిలోనూ అంచుల్ని తాకుతాడు. శని తొమ్మిదవ ఇంటిలో ఉన్నాడు. కాబట్టి ఈ జాతకుడు గొప్ప యోగి అవుతాడు. జూపిటర్ యొక్క స్థానం వల్ల జీవితంలో కొంతకాలం కష్టపడినా గొప్ప పేరు ప్రఖ్యాతులు, ఐశ్వర్యం సంపాదిస్తాడు. అదే సమయంలో శుక్రుడు, జూపిటర్ల (గురు) కలయిక వల్ల ఈ జాతకుడు గొప్ప ఆధ్యాత్మిక శక్తిని పొందుతాడు. అతని ఆశీర్వాదం ఇతరులకు శాంతి సౌఖ్యాలు సమకూరుస్తాయి. పన్నెండవ స్థానంలో అతను సాధు సన్యాసి జీవితాన్ని గడుపుతాడని తన కుటుంబం నుంచి వేరుగా ఉండటానికి ఇష్టపడతాడని సూచిస్తోంది. అతనికి ఈ ప్రాపంచిక విషయాలు 'నిజం' కాదని జీవితమంటే నీడ–ఛాయ మాత్రమేననే జ్ఞానం అకస్మాత్తుగా కలుగుతుంది. ఈ జాతకుడు ప్రాపంచిక జీవితం నుండి విరక్తి కల్గి కడకు దానిని త్యజిస్తాడు. ఈ జాతకుడు ఒక పేరు ప్రఖ్యాతులు గల కుటుంబంలో జన్మిస్తాడని

భృగు జాతకంలో వ్రాసి ఉంది. అలాగే, అతని బాల్యం అద్భుతాలతోను మరియు విచిత్రాలతోను నిండియుంటుంది. ఆశ్చర్యం కల్గించే స్వభావంతో ఈ జాతకుడుంటాడు. అతని నడవడిక గుణగణాలు అమానుషంగా ఉంటాయి. అతని జీవితం 25-30 సంవత్సరాల మధ్య పూర్తిగా మార్పు చెందుతుంది. ఈ మార్పు చెందిన మూడు సంవత్సరాల పిదప, అతని జీవితం ఒక నిర్దిష్టమైన, భిన్నమైన మలుపుకి గురవుతుంది. ఈ వ్యక్తి దైవభక్తిలో, అన్నపానాదులయందు అశ్రద్ధగా ఉంటాడు. ఆహారం గురించి అసలు ఆలోచించడు. ఏది తినడానికైనా ఉత్సుకత చూపడు.

**బాహ్యానికి మానవ శరీరధారుడుగా ఉన్నప్పటికీ, అంతర్గతంగా అతను పరిపూర్ణమైన పరమాత్మయే. ఈ అసాధారణమైన వ్యక్తిత్వం అతనికి అతి సమీపంలో ఉన్నవాళ్ళే తెలుసుకో గలుగుతారు. అతను విశ్వవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందుతారు. ప్రపంచవ్యాప్తంగా అతన్ని చూసిన వాళ్ళు మంత్రముగ్ధులౌతారు. అతడు సంపదలను, పేరు ప్రతిష్టలను సంపాదిస్తాడు. ప్రపంచంలోని గొప్పవాళ్ళు అతణ్ణి ఎంతగానో కీర్తిస్తారు. తన గురువుకంటే ఎక్కువ పేరు ప్రతిష్టలు సంపద గడిస్తాడు.**

**ప్రజలు ఎప్పుడైతే ఇతడిని క్రిందకు లాగి ఓడించాలని కోరుకుంటారో వాళ్ళే ఇతని చేతిలో** ఓడిపోయి అతని అనుచరులుగా, భక్తులుగా మారతారు. ఆయన చూపు ఎవరి మీద పడుతుందో వాళ్ళు అతనికి లొంగిపోయి శాంతి, అమితానందాన్ని పొందుతారు. అతనికున్న అపారశక్తియుక్తులు ఎంత బలహీనమైన వారికైనా, తిరుగులేని సంతోషాలను తెచ్చిపెడతాయి. ఇతరుల సంక్షేమం గురించి ఎల్లవేళలా ఆలోచించి మంచి జరిగేట్లు చూస్తాడు. ఇతరుల మెత్తని మనసులను ఎన్నటికీ నొప్పించడు. అతని చుట్టూ ఉన్న ప్రజలు ఎల్లవేళలా హాయిగా ఉంటారు.

**అతని వద్దకు రావలసినంత ధనం చేకూరుతుంది. దానిని మానవాళి బాగుకి ఖర్చు చేస్తాడు. ఇండియాకు బయట, మత ప్రచార కేంద్రాలను నెలకొల్పుతాడు. అక్కడ నుండి అనేక పరదేశీయులు అతనికి శిష్యులుగా భక్తులవుతారు.** అతని ఆరోగ్యం ఎప్పుడూ విచిత్రంగా మారుతూ ఉంటుంది. అతని ప్రవృత్తిలో స్థిరత్వముండదు. కానీ, దానిని అతడు ఎప్పుడూ పట్టించుకోడు. ఎందుచేతనంటే, అన్ని అవస్థలను ఒక్కలాగ తలుస్తాడు. తాను చేపట్టిన భారతీయుల ముక్తి గురించి ఈ దేశ సంక్షేమం గురించి ఈశ్వరుడు మానవ శరీర ధారణ చేశాడు. ఈ ప్రపంచంలో అతను ప్రాపంచిక నియమాన్ని పాటిస్తాడు. శాశ్వతంగా కూడా (అంతర్గతముగాను, ఆధ్యాత్మికముగాను) మంచి జరుగుతుంది. అతను ఎప్పుడైతే మౌనాన్ని పాటిస్తాడో అతని తపశ్శక్తి బలపడుతుంది. ఎప్పుడైతే మౌన విరమణ చేస్తాడో ఈ విశ్వానికంతటికీ మంచి జరగుతుంది. దాని వలన

భారతదేశమేకాక, యావత్తు ప్రపంచం వర్ధిల్లుతుంది. మానవ కళ్యాణానికి మాత్రమే మౌనవిరమణ చేస్తాడు.

ఏ విధంగా సద్గురువు స్పర్శ మాత్రముచే ఒకరాయి బంగారమవుతుందో అదేవిధంగా ఇతని పరిధిలోకి వచ్చే ప్రజలలో మార్పు కలుగుతుంది. అంతకు ముందు అతనిపట్ల పూర్తి ద్వేషమున్న వాళ్ళు కూడా ఇతనిని మెచ్చుకుంటారు. అదెలాగ జరిగింది? ఇదేమిటి? అనిపిస్తుంది. ఈ పరిస్థితిని చూసిన వాళ్ళకి ఆశ్చర్యం కలగక మానదు. ఏ విధంగా ఒక డాక్టరు రోగికి రోగ నిర్ధారణ చేసి మందులిస్తాడో అదేవిధంగా ఆధ్యాత్మికమైన శారీరక రోగములకు కూడా ఇతనొక గొప్ప వైద్యుడు.

**అతని పరిధిలోకి ఎవ్వరు వచ్చినప్పటికీ తమంతట తాముగా అతని భక్తులుగా మారిపోతారు.** సాధువులు, సంతులు ఇతని పరిధిలోనికి ఆయనకు పరిచయమవడానికి మిక్కిలి ఆత్రుత చెందుతారు. మొత్తమ్మీద, ఈ అసాధారణ జాతకుడు విశ్వానికంతటికీ సౌభాగ్యాన్ని కలుగజేస్తారు. మానవ కళ్యాణానికి అనేక ఉన్నత, ఉదాత్త పనులను నెరవేరుస్తారు. ఈ అలౌకిక ఆత్మవలన అతని కుటుంబానికి మంచి జరగడమే కాకుండా, అతనిని కలిసిన అందరికి అన్నివిధాల లాభం కల్గుతుంది. అతను అందరికి రక్షకుడు, మోక్ష ప్రదాత.

**(1941లో ఆనాటి మెహెర్‌బాబా మాసపత్రికలో ప్రచురితమైన మెహెర్‌బాబా జాతకం తిరిగి 2004 మార్చిలో తిరిగి మన 'మెహెర్‌బాబా' మాసపత్రికలో ప్రచురించే వీలు కల్గడం కేవలం ఆయన కృప - యాదృచ్ఛికం అనొచ్చు.)**

***

**హౌ ఎ మాస్టర్ వర్క్స్ ఐ.వీ. డ్యూస్ రాసిన గ్రంథంలో తనకు జ్యోతిష్యంలో ఆసక్తి వుందని** చెబుతూ తాను ఢిల్లీకి దగ్గర్లో వున్న హెచ్.ఆర్ అనే ప్రముఖ జ్యోతిష్యుడ్ని కలిశానని చెప్పారు. ఎందుకంటే ఆయన దగ్గర భృగుసంహిత మూల గ్రంథ ప్రతులున్నాయి. ప్రస్తుతం  భృగుసంహిత కాపీలు కేవలం నాలుగు మాత్రమే భారతదేశంలో లభిస్తున్నాయని అన్నారు. భృగుసంహిత ఒక పుస్తకం కాదు. తాళపత్రాలవి. హెచ్ ఆర్ దగ్గర ఈ పత్రాలు బాగా నలిగిపోయి, మసిపట్టి వున్నాయి. ఆయన జాగ్రత్తగా పరిశీలించి తన కుమార్తె జాతకం చెప్పారని ఐవీ డ్యూస్ పేర్కొన్నారు. ఐతే ఈ విషయం బాబా సోదరి మణిజాకు లేఖ రాస్తే, మేం జ్యోతిష్యున్ని కలవడం బాబాకి నచ్చలేదని, సున్నితంగా తనని మందలించా రామె అని 'సద్గురు కార్యసరళి' రచనలో పేజి. 294-295 పేర్కొన్నారామె.

***



# శ్రీ వేల్పుల నిరాకారరావు

**(అది 1965వ సంవత్సరం. బాబా ఏకాంతవాసంలో వున్నారు. బాబాతో ఉత్తర ప్రత్యుత్తరాలు చేయవద్దని ప్రేమికుల్ని ఆదేశించారు. ఐతే, అలాంటి సమయంలో బాబా నుండి శ్రీ వేల్పుల ఆశీశ్శులు అందుకున్నారు).**

**శ్రీ వేల్పుల నిరాకారరావు (89), హైదరాబాద్ 2026** మార్చి 24 అర్థరాత్రి దాటాక అవతారుని నామస్మరణతో బాబాలో ఐక్యమయ్యారని, ఆయన కుమారుడు శ్రీ మెహెర్ జీవన్ తెలిపారు. శ్రీ నిరాకారరావు నిరంతరం బాబా నామస్మరణలో గడిపారు. ఇటీవల ఆయన ఆసుపత్రిలో చికిత్స తీసుకునే సమయంలో తన ఎదురుగా బాబావారి నిలువెత్తు చిత్రపటం వుంచుకుని, బాబాని కన్నార్పకుండా చూస్తూ, నామస్మరణతో గడిపారని శ్రీ జీవన్ తెలిపారు. శ్రీ నిరాకారరావు మెహెర్‌బాబా పత్రిక పాఠకులకు ఎన్నో చక్కని వ్యాసాలు అందజేశారు. బాబా స్వయంగా ఇచ్చిన భగవన్నామావళి – 101 పేర్లను ***(లార్డ్ మెహెర్ వాల్యూం -8 పేజీ 4381-4183)*** సుమారు రెండున్నర దశాబ్దాల క్రితమే శ్రీ వేల్పుల చక్కని తెలుగులో అనువదించారు. శ్రీ వేల్పుల గారి తెలుగు అనువాదాన్ని మెహెర్‌బాబా పత్రికలో 2015 ఏప్రిల్ సంచికలో ప్రచురించడమైంది. ఈ నామావళిని మనసారా నిత్యం పఠించమని బాబా తన ప్రేమికుల్ని ఆదేశించారు. ఈ నామాలను పఠించినవారు మరో ప్రార్థన చేయవల్సిన పన్లేదని బాబా సూచించారు. శ్రీ వేల్పుల గారికి నివాళిగా ఈ నామావళిని త్వరలో మెహెర్‌బాబా పత్రికలో పాఠకులందరి కోసం పునర్ముద్రించవలెనని మా ఆకాంక్ష.

## ఇర్విన్ లక్ ఇంటర్వ్యూ

**1976లో అమెరికన్ బాబా ప్రేమికులు ఇర్విన్ లక్ సోదరులు కొంతమంది విశాఖ ప్రేమికులను ఇంటర్వ్యూ** చేస్తూ, శ్రీ వేల్పులవారి మాటలు కూడా వీడియో రికార్డు చేశారు. అప్పటికి వీరు బాబా పరిధిలోకి వచ్చి ఒక దశాబ్ద కాలం నిండింది. ఆ వీడియో ఇంటర్వ్యూలో శ్రీ వేల్పుల చెప్పిన మాటల్ని, ఆయన మాటల్లోనే చదువుకుందాం.

**"నేను వాల్తేరు రైల్వే శాఖలో పనిచేశాను. నేను కృష్ణ భక్తుడ్ని. భగవద్గీతని అధ్యయనం చేశాను.** 1965లో ఫిబ్రవరి 25న బాబా జన్మదిన వేడుకల సందర్భంగా మెహెర్‌బాబా గురించి పలు న్యూస్ పేపర్లలో చదివాను. మెహెర్‌బాబా ఫోటో కూడా ఆనాటి పత్రికలలో

ప్రచురించారు. ఆ మాదిరిగా నేను తొలిసారిగా మెహెర్‌బాబా గురించి తెలుసుకున్నాను. ఆ తర్వాత ఎవరీ మెహెర్‌బాబా? అని ఇంకా తెలుసుకోవాలని ప్రయత్నించాను.ఆ తర్వాత విశాఖలో ఏర్పాటైన బాబావారి సత్సంగ్‌లలో పాల్గొన్నాను. క్రమేపీ, నాకు తెలియకుండానే బాబావారి పట్ల గురికుదిరింది. సరిగ్గా ఈ సమయంలో బాబావారి దర్శన కార్యక్రమం గురుప్రసాద్, పూణేలో ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి బాబా ప్రేమికులు శ్రీ సుసర్ల సూర్యనారాయణ తదితరులతో కలిసి నేనూ పూణే వెళ్ళాను. అలా తొలిసారిగా అవతారుడ్ని దర్శించుకున్నాను. అవతారునికి సాష్టాంగ నమస్కారం చేశాను. మెహెర్‌బాబా పురాణ పురుషుడని నమ్మకం కలిగింది. వాల్తేరుకు తిరిగి వచ్చాక, బాబా దివ్యత్వాన్ని స్తుతిస్తూ ఆరు చరణాలతో ప్రతివారం బాబాకు ఒక లేఖ రాసేవాడిని. ఆ లేఖలో నా పేరు, చిరునామా ఏమీ వ్రాసేవాడిని కాదు. ఏ కోరిక లేదు. నేను రాసిన ఒక లేఖ ఇలా వుంది.

**ఓం మెహెరు దేవం సద్గురుం ఆత్మ స్వరూపం**
**"ఓం పరబ్రహ్మం ఆదిమధ్యాన్తరహితం;**
**ఓం సచ్చిదానందం సర్వవ్యాపితం స్వయం ప్రకాశం;**
**ఓం సత్యం శివమ్ సుందరమ్ సగుణ సాకారం సర్వేశం;**
**ఓం నిర్వికారం నిరంజనం దివ్యం మౌన ముద్ర ప్రభాసితం;**
**ఓం మెహెరు దేవం సద్గురుం ఆత్మస్వరూపం ప్రణమామ్యాహం."**

**అవతారునికి అవగతం కానిది ఏముంటుంది. కొన్ని రోజుల తర్వాత శ్రీ సుసర్ల మాయింటికి** వచ్చారు. నీవేంటి బాబాకు ఉత్తరాలు రాస్తున్నావట అన్నారు. నీ లేఖలో పేరు, చిరునామా వ్రాయాలి కదా అంటూ, మండలి సభ్యుడైన భావూ నీ పోస్టల్ అడ్రస్సు అడుగుతున్నారని చెప్పారు. సుసర్ల నా అడ్రస్సు భావూకి తెలియజేశాడు. ఆ దరిమిలా మండలి వారి నుండి నాకొక లేఖ వచ్చింది. ఆ లేఖ హిందీలో వుంది. బహుశా, భావూ రాసారేమో! ఆ లేఖ సారాంశం మాత్రం ఇలా వుంది.

**"నీవు వ్రాసిన ఉత్తరాలు బాబా చూశారు. నీ మౌన ప్రేమకు బాబా సంతోషించారు. నీకు** మీ కుటుంబానికి బాబా ప్రేమాశీస్సులు తెలిపారు", అని ఆ లేఖలో వుంది. అది బాబా కఠిన ఏకాంతవాసంలో వున్న రోజులు. బాబా ప్రేమికులతో ఉత్తరప్రత్యుత్తరాలన్నీ నిషిద్ధం. ఒకవేళ ఏవైనా ఉత్తరాలు వస్తే, బాబా ఎదుట చదవరాదన్నది బాబా ఆదేశం. ఇదంతా చాలాకాలం తర్వాత నాకు తెలిసింది. ఐతే, నా లేఖలతో బాబా నుండి నేనేమీ ఆశించలేదు. నా పేరు కూడా రాయలేదు. నా లేఖల్లో దైవస్తుతి చేశాను. భగవంతుడు ఆశించే నిస్వార్థ ప్రేమతో లేఖ రాశాను. అందుకేనేమో, ఏకాంతవాసంలో వుండి కూడా బాబా నాకు బాబా తన ప్రేమాశీశ్శులు పంపారంటారు శ్రీ వేల్పుల. ఇది నా జీవితంలో జరిగిన గొప్ప మధురానుభూతి. నిస్వార్థ ప్రేమకు బాబా తక్షణం స్పందిస్తారనడానికి ఇదొక మచ్చుతునక.



# మెహెరీశం

**అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర**
**ఆంగ్ల మూలం:- భావూ కల్చూరీ**
**లార్డ్ మెహెర్, 1925 నుండి**
***తెలుగుసేత:*** ***మల్లాది రామారావ్, మెహెరాబాద్***

**(గత సంచిక తరువాయి)**

**శారీరకంగా, మానసికంగా మిమ్మల్ని గిలగిల లాడిస్తే? ఆ కష్ట సమయంలో మీరేం చేస్తారు.** అంతా బాబా దయ అని నిమ్మకు నీరెత్తినట్లు వుంటారా? ఏం పాపం చేశానని నాకీ శిక్ష అనుకొంటారా? మీ దృక్పథం ఎలా వుంటుందో కష్టాలపాలయినప్పుడని గమనిస్తున్నా నన్నారు. ఈ పరీక్షల్లో కిట్టీ నెగ్గినదట. ఈ మాట బాబావారే అన్నారు. సూటి పోటి మాటలు, ఎద్దేవాలు తట్టుకొని నిలబడింది అన్నారు. “నా పరీక్షలో గట్టెక్కావు, కిట్టీ”, అంటూ ఆమె ఎదురుచూస్తున్న శహభాష్ చెప్పారు నలుగురి ముందూ.

**కిట్టీ వొళ్ళు జలదరించింది. అవతారుని మెప్పించ గలిగానని పొంగి పోయింది ఇంతలో** గుర్తు వచ్చింది ప్రభువు ఉవాచ. ఆధ్యాత్మిక మార్గంలో అహంకారం, అతిశయం, గర్వం తగదు కదా. ప్రభువు మెచ్చారన్న ఆనందంలో ఈ సంగతి మరిచిపోయాను, మందబుద్ధిని అని లెంపలు వేసుకొంది. క్షమించు ప్రభూ అని వేడుకొంది. నీ సేవలో కృతార్థురాలిని చేయి స్వామీ అని ప్రార్థించింది మౌనమూర్తిని మౌనంగా.

**చర్చ వాతావరణం పైకి మళ్ళింది. ఇక్కడ వుండటం కష్టమేనన్నారు బాబా. సూర్యుడు** కనిపించి ఎన్ని రోజులయిందో లుగానోలో. ఈ మాటనే బాబావారు అన్నారు లండన్‌లో వాతావరణం బాగాలేదని ఇక్కడకి వచ్చాము. బహుశా లండన్ వాతావరణాన్ని మన వెంట తెచ్చుకొన్నామేమో అంటూ చమత్కరించారు. అసలు యిదంతా మాయ వల్లనే అన్నారు. విశ్రాంతి కోసం వచ్చాము యిక్కడికి. కానీ మాయ వుంది చూశారూ దానికి ఇష్టం లేదు కామోసు. అందుకనే హాయిగా విశ్రాంతి తీసుకోనీకుండా చేస్తోంది శాయ శక్తులా. మాయ ఆటలు సాగనివ్వను. తాళం త్రిప్పుతాను. సూర్యుడు ప్రకాశించేలా చేస్తాను వొక రోజు అయినా అన్నారు.

**ప్రభువు అన్నంత పని చేయగలడని కిట్టీ ప్రభుతులకి తెలుసు. ఏదో ఉడతా శక్తిగా** ప్రయత్నిద్దాం మెహెరునికి వూరట కల్గిద్దామన్న తాపత్రయం వాళ్ళది.

**'జెనెరోసో'** అన్న కొ'ండ వుంది ప్రభూ. అక్కడికి వెళ్ళి వద్దాం. పెద్ద దూరం కాదు అంది కిట్టీ. మెహెరీశుడు సరేనన్నారు మర్నాడు అంటే మే మూడవ తేదీ ఉదయం తొమ్మిదింటికి బయలుదేరారు. లుగానో సరస్సు దాటి వెళ్లాలట. అందుకని పడవలు మాట్లాడుకొన్నారు. ప్రయణం సాఫీగా జరిగింది.

**పడవలో బాబావారి ఎదురుగా కూర్చోవాలనుకొంది కిట్టీ. కానీ ఆ అదృష్టం వో వయస్సు** మళ్ళిన ఆయనకి దొరికింది. స్థానికుడు అంటే స్విట్జర్లాండ్ వాడాయన. కూలి పని చేసుకొని పొట్ట నింపు కొంటున్నాడట. ఈ భోగట్టా దరిమిలా తెలిసిందనుకోండి. అప్పుడు అదే ఆ పడవ ప్రయాణం చేస్తున్నంతసేపు, అతగాడి అదృష్టానికి ఈర్ష్య పడ్డారు కిట్టీ ప్రభుతులు. అతగాడు జెనెరోసో కొండ వరకూ రాలేదు. మధ్యలోనే దిగిపోయాడు, వో చిన్న వూరిలో పడవ దిగుతూ బాబావారి కేసి చూశాడు. ఆ మోహంలో మహదా నందం కన్పించింది.

**తాను అప్పటిదాకా, వో గంటసేపు కూర్చొన్నది యుగావతారుని సమక్షంలో అని అతగాడికి** తెలుసో తెలియదో? బహుశా వో ఆధ్యాత్మికోన్నతమూర్తి ఎదురుగా కూర్చొన్నాననుకొ న్నాడేమో? ఏది ఏమయితేనేం, తన అదృష్టం పండిందనిపించింది. అందుకనే పడవ దిగి పోతూ ప్రభువు కేసి మరొక్కసారి తేరిపారా చూశాడు. ఆ చూపులో ఆనందం వుంది. ఈ జన్మకీ భాగ్యం చాలు అన్న కృతజ్ఞతా భావం వుంది.

**అయితే ఇవి ఏమీ తెలియని మన కిట్టీ ప్రభుతులు, హమ్మయ్య, వెళ్ళి పోయాడీ పాంథుడని** వూపిరి తీసుకొన్నారు. వూహించని ప్రశ్న బాబావారు వేశారు వాళ్ళకి. "ఇదిగో ఇప్పుడు దిగి వెళ్ళాడే, ఆ పెద్దమనిషి, అతనిలో ప్రత్యేకత గమనించారా అని అడిగారు. తల అడ్డంగా వూపారు అందరూ. ప్రభూవు ఎదురుగా కూర్చొనే అదృష్టం మాకు లేకుండా చేశాడన్న సణుగుడే సరిపోయింది. అతనిలో ఏదో ప్రత్యేకత వుందనుకోలేదు. ఆ మాటే చెప్పారు ప్రభువుతో. మెహెరీశుడు చిరుదరహాసం చేశారు. మీరంతే, మీకేదీ పట్టదు. మీగోల మీదే, అన్న చురక కనిపించింది ఆ చిరునవ్వులో.

**కూలితో పొట్టనింపుకొనే ఆ పెద్దాయన విశిష్ఠ వ్యక్తి అన్నారు. "ఇతను నా ప్రతినిధి" అన్నారు.** రెండు మూడు భూమికల మధ్య వున్నాడట. నేనిక్కడికి ఎందుకు వచ్చాను. విశ్రాంతి కోసం. అవునా మరి నేను విశ్రాంతి తీసుకొంటే నా విశ్వకార్యక్రమం ఎవరు చేస్తారు. ఆ పని ఇంకొకరికి అప్పగించాలి కదా. ఆ ఇంకొకడే మీరు చూసిన కూలీ. ఈవాళ్టి ఉదయమే నా పనిని బదలాయించాను అతనికి, అని చెప్తూ ఈ ఏర్పాటు శాశ్వతం కాదు. తాత్కాలికమే నేను లుగానో నుంచి వెళ్ళిపోయే వరకు అన్నారు.

**ప్రభువు పని అందరూ చేయగలరా? ఆధ్యాత్మికోన్నతి పొందిన వారికే అసాధ్యం. మరి** ఇతగాడు రెండు మూడు భూమికల్లో వాడని మెహెరీశుడే శెలవిచ్చారు కదా. ఇలా సాగుతున్న వాళ్ళ ఆలోచనలకి చెలియలి కట్ట వేశారు బాబావారు. "ఇతగాడిని పైకి తీసుకువెళ్ళాను రెండు–మూడు భూమికల మధ్య నుంచి నాలుగు–ఐదు భూమికల మధ్యకు తీసుకువచ్చాను", అని అంటూ, మెహెరుడు వాళ్ళ ధర్మ సందేహం తీర్చారు.

**ఇంకొక మాట శెలవిచ్చారు తమ పనిని తాత్కాలికంగా బదిలీ చేయడం ఎక్కడపడితే అక్కడ** సాధ్యం కాదుట. దట్టమైన అడవుల్లో కానీ, ఎత్తైన కొండపైన కాని ఈ పని చేయవచ్చు అన్నారు. జన సమూహం మధ్య కూర్చొన్నప్పుడు కూడా చేయవచ్చు ఈ బదలాయింపు. ఈవాళ్టిలా పడవ ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా నా పనిని ఇంకొకళ్లకి అప్పగించవచ్చు కాసేపు. నా పనిచేసిపెట్టే అదృష్టం అందరికీ దొరికదు. ఆ అదృష్టం అతనిని వరించింది.

**ఆ పెద్దాయిన ఆనందంగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. మీరు గమనించారో లేదో. నా ముందు** కూర్చొన్నంతసేపూ చేతికర్రతో పడవపై సుతారంగా కొట్టాడు పాటకి తాళం వేస్తున్నట్లు. తమ తాళానికి బదులిచ్చాడు సరిగ్గా అన్నారు. బాబావారి మాట కిట్టీ ప్రభుతుల బుర్రలకి ఎక్కలేదని వాళ్ళ మోహాలు చూస్తూనే తెలుస్తోంది. ఎంతటి క్లిష్టమైన విషయాన్నైనా అందరికీ అర్ధమయ్యేలా చెప్పడం మెహెరీశుని ప్రత్యేకత. బాబా ఉవాచ అర్ధంచేసుకోడానికి శబ్దరత్నాకరాలు అక్కర్లేదు. ఇదే జరిగింది ఈవాళ కూడా. ఘనీ చేతికర్ర తీసుకొని తాము తాళం వేసిన తీరు, అతగాడు బదులిచ్చిన పద్ధతి చూపించారు. ఆ పెద్దమనిషి బాబావారికేసి తేరిపార చూస్తూ కూర్చోలేదుట. బాబావారు తమ తాళంను మూడుసార్లు మార్చారుట. అయినా అతగాడు బుర్రపట్టుకోలేదు. మార్చిన నా తాళానికి సరిపోయే తాళం వేశాడని అన్నారు.

**పేరూ వూరులేని ఈ స్విట్జర్లాండ్ నివాసి ధన్యుడనుకొన్నారు ఘనీ, కిట్టీ ప్రభుతులు. అతగాడికి** ప్రభువు కానుక పంపించారు. "వెన్న, బ్రెడ్ యిచ్చిరండి" మరింత ఆనందిస్తాడు ఆసామి", అని మెహెరుడు అన్నారు. ప్రభువాజ్ఞని శిష్యులు పూర్తిచేయటం, పడవ ముందుకు సాగడం వొకేసారి జరిగాయి. మెహెరీశుని కరుణకి పాత్రుడైన ఆ సిద్ధపురుషుడు ప్రభువు పంపిన ప్రసాదాన్ని కళ్ళకు అద్దుకొని తిన్నాడు.

**లుగానోలో తారసపడ్డ సిద్ధపురుషుడికి పెళ్ళయింది. సంసార సాగరంలో ఈదుతూ కూడా** ఆధ్యాత్మికోన్నతి సాధించాడు అని చెప్తూ బాబావారు అతని భార్య గురించి అన్నమాట కిట్టీ, కిమ్, ఘనీ ప్రభుతులని ఆశ్చర్యచకితులను చేసింది. ఈ నా ప్రతినిధి భార్యకు, భర్త ఆధ్యాత్మికస్థాయి తెలీదు. ఆమెకే కాదు, అతని కుటుంబంలోని వారెవరికీ

తెలీదు అని బాబావారు వెల్లడించారు. ఇది విడ్డూరం కదూ అనిపించింది కిమ్, మింటా, కిట్టీ ప్రభుతులకి. ఏడవ భూమిక భగవత్ చైతన్యం పొందిన అదృష్టవంతుడు ఒక్కరే వున్నారు ఐరోపాలో. భగవత్ చైతన్యం పొందిన వ్యక్తులు మొత్తం 56 గురు వుంటారు ప్రతి అవతారకాలంలో. బాబావారే చెప్పారీ సంగతి. మూడు– ఆరు భూమికల మధ్య వున్న సిద్ధ పురుషులు ఐరోపాలో చాలా కొద్దిమంది మాత్రమే అన్నారు.

**ఇక్కడ, అదే ఐరోపా ఖండంలో, ఆరవ భూమికలో వొకరున్నారని బాబా చెప్పారు. ఐతే ఆ వ్యక్తి వైనం** వెల్లడించలేదు ఎందుకనో మరి. తమ ఆంతరంగిక మండలి వారితో పోలిస్తే, ఈ ఐరోపా ఉన్నతాత్మలు ఎందుకు కొరగారన్నారు. మెహెరీశుని ఆంతరంగికులు అందరూ ఏడవ భూమికలో వారే, వారు నా ఆదేశాలని తూ.చ.తప్పకుండా అమలు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడే కాదు. ఎప్పటి నుంచో యుగయుగాలుగా భగవంతుని ఆదేశ పాలనే ఆంతరంగిక మండలి వారు చేస్తున్నారట. మెహెరుడే శెలవిచ్చారీ సంగతి.

**ప్రభువు యింకేమన్నారో తెలుసా పాఠక మహాశయా! వచ్చే నవంబరులో ఐరోపాలో చేపట్టే** విశ్వ కార్యక్రమానికి పునాది వేశారుట. నేటి మే 3వ తేదీ తెల్లవారుఝామున రెండు గంటలకి పూర్తయిందట ఆ పని. నాలుగు రోజులుగా చేస్తున్న పని. విశ్వవ్యాప్తమైనదా పని. చాలా వేగంగా చేశాను అని బాబావారు చెప్తుంటే, కిట్టీ ప్రభుతులు నోరు వెళ్ళ బుచ్చారు. మన మధ్యనే వున్నారు బాబా కానీ మన వూహలకి అందని విశ్వకార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో మెహెరీశుని దగ్గరగా వుండటం మన అదృష్టం. పూర్వజన్మ సుకృతం అనిపించింది.

భవిష్యత్‌కి పునాది లుగానోలోనే పడిందన్న సంతోషంలో కామోసు,సూర్యుడు మబ్బుల్లోంచి బయటకి వచ్చారు. వాతావరణం మెరుగైంది. గత నాలుగు రోజులు ఎండ మొహం చూడక చికాకు చికాకుగా వుంది అందరికీ. నీరసం పట్టుకొంది. ఇప్పుడు కాస్తంత మళ్ళింది గాలి. ఐనా సరే, ప్రభువు సంతోషంగా లేరుట. ఈ మాటని మెహెరీశుడే స్వయంగా చెప్పారు. సంతోషం ఎలా వుంటుందని ఎదురు ప్రశ్నవేశారు. కిట్టీ ప్రభుతులకి అర్థం కాలేదు ప్రభువు మాట. ఏదో ఇన్ని రోజులకి సూర్యుడు కనిపిస్తున్నాడు. గాలి మళ్ళింది అని అందరూ సంబర పడుతుంటే ఇదేమిటి? బాబావారి మాట విడ్డూరంగా లేదూ? అనిపించింది. మీ బుర్రలు పాదరసం అనలేదు బాబావారు కానీ ఆ అర్థం స్పష్టంగా కనిపించింది బాబా ఉవాచలో. ఇంతకీ బాబావారు ఏమన్నారు అంటే? ప్రపంచం నలుమూలలా ఎందరో బ్రహ్మానందం అనుభూతి కోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళు ఒకళ్ళా యిద్దరా, లక్షలాదిమంది. బ్రహ్మానందం కోసం చకోర పక్షుల్లా వాళ్ళు ఎదురు చూస్తుంటే నేను సంతోషంగా ఎలా వుండగలను మీరే చెప్పండి. అనంత చైతన్య సాగరంలో

ఆఖరి బిందువు (ఆత్మ) కూడా బ్రహ్మానుభూతి పొందే వరకూ ఆనందంగా వుండలేనన్నారు. మళ్ళీ అందరి దృష్టి ప్రకృతిపైకి మళ్ళింది. ప్రకృతి అందాలు శోభాయమానంగా కనిపించాయి ఈ ప్రాంతం కాశ్మీరులా వుందన్నారు మెహెరుడు. కేబుల్ కారు ఎక్కారు అందరూ. జెనెరోసో కొండ శిఖరాగ్రాన్ని చేరారు. మంచుతో కప్పబడింది ఈ ప్రాంతం. 5600 అడుగుల ఎత్తు ఆ కొండ శిఖరం. సూర్యుడు కనికరించాడు. సూర్యకిరణాలు ఆ మంచులో మెరుస్తున్నాయి. పర్యాటకులు మంచుతో ఆడుతూ కనిపించారు. బాబా కూడా మంచు ముద్దల్ని కిట్టీ ప్రభుతులపై సరదాగా విసిరారు. సృష్టికర్తకి బోల్డంత వినోదం దొరికిందావాళ. హోటలు కనిపించింది. ఆ హోటలు బయటే అమ్ముతున్నారు తినుబండారాలు. ముల్లంగి కూర, బంగాళాదుంపలతో చేసిన చిప్సులు కొన్నారు. జున్ను దొరికింది. అది కూడా ప్యాక్ చేయించారు. అనువైనచోట కూర్చుని భోజనం అయిందనిపించారు.

**హుషారుగా వున్నారేమో బాబావారు భూమికల గురించి మళ్ళీ వివరించారు సోదాహరణంగా.** హోటల్‌లో టేబుల్ టెన్నిస్ బల్ల కన్పించింది. కాసేపు ఆడారు. ఆట బాగా రక్తి కట్టింది. కాసేపు రెస్టు తీసుకొని బయలుదేరారు. ఎక్కడికి అని అడగకండి పాఠక మహాశయా, వో పర్వతం శిఖరాగ్రాన వున్నారు. ఆ చుట్టూరా తిరిగారు కాసేపు. ప్రకృతి అందాలని ఆస్వాదించారు. చీకటిపడేలోగా లుగానో హోటల్‌కి వచ్చి చేరారు. ఈవాళ్టి వినోదయాత్ర సాఫీగా జరిగిందనాలి. ఎవరూ కష్టపడ లేదు సరికదా అందరూ ఉల్లాసంగా గడిపారు కొండపైన వున్నంతసేపు.

**తెల్లవారుతూనే (మే 4వ తేదీ) బాబావారి తండ్రి షెరియార్జీ కన్నుమూశారన్న వార్త వచ్చింది.** బాబావారు నిశ్చలంగా వున్నారు కానీ, మండలివారు దుఃఖసాగరంలో మునిగి పోయారు. వారందరికీ షెరియార్జీ అంటే ఎంతో గౌరవం. భగవంతుడిని వెతుకుతూ ఇరాన్ నుంచి ఇండియా వచ్చిన వ్యక్తి యుగావతారునికే తండ్రి అయ్యాడు. కవి కాదు కానీ, ఎందరో కవుల రచనలు కంఠోపాఠం వచ్చాయనకి. హాఫీజ్, రూమీల సుభాషితాలు ఆశువుగా చెప్పేవాడు. ఏప్రిల్ 30వ తేదీ రాత్రి బొంబాయిలో స్వర్గవాసుడయ్యాడు షెరియార్జీ. ఈ వార్త లుగానో చేరడానికి ఐదు రోజులు పట్టింది. గమ్మత్తుగా లేదూ. జనన మరణాలకి అతీతుడైన మెహెరీశునికి తండ్రి మరణవార్త ఆలస్యంగా అందింది. పాపం రమ్జూ తప్పు లేదు. ఏప్రిల్ 30నే పంపాడు కేబుల్. ఐతే, బాబావారు లుగానోలో వున్నారని తెలియక, లండన్‌కి పంపాడు. ఆ కేబుల్‌ని లుగానోకి తిరిగి పంపించాడు క్వెంటన్ టాడ్. ఆ టెలిగ్రామ్ చూస్తూనే పెద్ద ఆది నాలిక కరుచుకొన్నాడు. తప్పయిపోయింది, బాబా, మంద బుద్ధిని అంటూ లెంపలు వేసుకొన్నాడు.

**– సశేషం**

# అవతారుని జన్మదినోత్సవాలు

## జంట నగరాలలో

జంటనగరాలలో అవతారుని జన్మదినోత్సవాలు వైభవంగా జరిగాయి. జూబ్లి హిల్సు బాబా కేంద్ర ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 24 సాయంత్రం 5.30 నుండి సుమారు ఒక గంటసేపు నగర సంకీర్తన నిర్వహించారు. ఫిబ్రవరి 25న తెల్లవారుఝామున 4.30 నుండి మ. 2 వరకూ ప్రత్యేక ప్రేమిక సహావాస్ నిర్వహించారు. సహావాస్‌లో బాబా సందేశాలపై భజన గీతాలు, ప్రసంగాలు, లఘు నాటికలు, ఫిల్ము ప్రదర్శన బాబా ప్రేమికులను అలరించాయి. ఆ రోజు సాయంత్రం కోఠి బాబా కేంద్ర ప్రాంగణంలో సా. 5.30 నుండి రాత్రి 8.30 వరకూ, ఫిబ్రవరి 26వ తేది సాయంత్రం మల్కాజ్‌గిరి కేంద్ర ఆధ్వర్యంలో అలాగే, ఫిబ్రవరి 27న అత్తాపూర్ కేంద్ర ఆధ్వర్యంలో బాబావారి జన్మ సందేశాలపై పలువురి ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాబా జన్మదిన వేడుకలను నిర్వహించారు. కాగా, బ్లడ్ డొనేషన్ క్యాంపును మార్చి 1న జూబ్లి హిల్సు సెంటర్‌లో నిర్వహించగా 70 మంది యువత ఉత్సాహంగా ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. మార్చి 14న మనోనాశ్ గుహ ప్రాంగణంలో బాబావారి జన్మదిన వేడుకల ముగింపు కార్యక్రమాన్ని వైభవంగా జరిగింది. ప్రేమికలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాలలో శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ పి. రాజేంద్ర మెహెర్, శ్రీ కె. కళ్యాణ్, శ్రీ సంతోష్ బెహరా, శ్రీ ఈశ్వర్, శ్రీ యం. రాఘువ, శ్రీ చంద్రమోహవ్ తదితరులు బాబావారి జన్మదిన కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా పాల్గొన్నారు.

## బెంగళూరులో

మార్చి 1 వ తేదీన బెంగళూరు జయానగర్ సెంటర్‌లో బాబావారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు శ్రీమతి నర్మదా నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు సుమారు 500 మంది హాజరయ్యారు. బాలగోపాల మెహేర్ ఈశా, చెన్నై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాబావారి సందేశాలు ముఖ్యంగా, ఆనందమయ జీవనం గడపటం, ప్రేమ, నిస్వార్థ సేవ, వివాహంతో ఆధ్యాత్మిక ప్రగతి తదితర అంశాలపై శ్రీ మెహేర్ ఈశా హృద్యంగా ప్రసంగించారు. మెహెరాబాద్ నుంచి వచ్చిన శ్రీ జల్లు వెంకట రమణ, శ్రీ మెహెర్ చరణ్ భజన గీతాలను ఆలాపించారు. ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో వివాహమైన నవ దంపతులు చి. సాయి నిఖిల్, చి.ల.సౌ. వైష్ణవి బాబా ప్రార్థనలు చేశారు. అనంతరం, బాబావారి బర్త్ డే కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ఆరతితో ముగించినట్లు శ్రీమతి నర్మదా ఒక ప్రకటనలో తెలిపారు.

## విజయనగరం కేంద్రం

2026 ఫిబ్రవరి 1 నుండి 28వ తేదీవరకూ అవతారుని జన్మదిన వేడుకలు విజయనగరం కేంద్ర ఆధ్వర్యంలో బాబా కేంద్రంలో అలాగే, పలువురి బాబా ప్రేమికుల గృహాలలో ఘనంగా జరుపుకున్నట్లు శ్రీ కామేశ్వరరావు అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు. అవతారుని జన్మదినోత్సమైన ఫిబ్రవరి 25న కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు, ఆ రోజు సేవాకార్యక్రమంలో భాగంగా చెవిటి, మూగ, విద్యార్థుల పాఠశాలను సందర్శించి, స్థానిక విద్యార్థులకు పండ్లు, బిస్కట్లు అందజేసినట్లు శ్రీ కామేశ్వరరావు తెలిపారు.

విజయనగరంలోని శ్రీ ప్రకాశరావు గారి స్వగృహంలో ఫిబ్రవరి 8వ తేదీన సత్సంగ్ కార్యక్రమం వైభవంగా జరిగింది. శ్రీమతి శైలజ బాబావారి సందేశాలపై ప్రసంగించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## చల్లపల్లి కేంద్రంలో

మెహెర్‌బాబా వారి 132వ జన్మదిన వేడుకలు ఫిబ్రవరి 1 నుండి 25వ తేదీ వరకు 25 రోజులపాటు ఘనంగా నిర్వహించినట్లు కార్యదర్శి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలలో శ్రీ చుండూరి మెహెర్ ప్రసాద్, శ్రీ మద్దాళి దుర్గాప్రసాద్, శ్రీ కోసూరి మురళీ కృష్ణారావు, శ్రీ బిహెచ్ కేశవరావు, శ్రీ కిలారు నాగార్జున, శ్రీ ప్రసన్నకుమార్, డాక్టర్ జయ సూర్య, శ్రీ వురిమి రమేష్ బాబా సందేశాలపై ప్రసంగించారు. ఫిబ్రవరి నెలలో వచ్చిన 4 ఆదివారంనాడు ఏకనామం నిర్వహించినట్లు తెలిపారు.

## రాజాం కేంద్రంలో

ఫిబ్రవరి 25వ తేదీన రాజాం కేంద్రంలో ఉదయం 4.30 నుండి సంకీర్తనలు 132 కొవ్వొత్తులు వెలిగించుట, కేంద్ర అధ్యక్షులు శ్రీమతి భాగ్యలక్ష్మి గారిచే కేక్ కటింగ్, హారతి, ప్రార్థనలు జరిగినవి. శ్రీమతి రమ సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. శ్రీ రమణమూర్తి తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు.

## కదిరిలో

అవతార్ మెహెర్‌బాబా ప్రేమ నిలయం కదిరిలో బాబావారి జన్మదినోత్సవాలు ఘనంగా జరుపుకున్నట్లు తెలిపారు.

## జోగిపేట బాబా కేంద్రంలో

బాబా జన్మదినోత్సవాలు ఫిబ్రవరి 25 తెల్లవారుఝామున 5 నుండి నిర్వహించినట్లు అధ్యక్షులు శ్రీ కె. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నగర సంకీర్తన, మౌనం, బాబా


తగరపువలస


రాజాం


జోగిపేట

నామస్మరణ, ధుని ప్రజ్వలన, బాబా సందేశాలపై ప్రసంగాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సా. 7 గంటలకు బాబావారికి ప్రార్థనలు, ఆరతి ఇచ్చామని అయన తెలిపారు.

## శ్రీకాకుళం

బాబావారి జన్మదిన వేడుకలు ఫిబ్రవరి 1 నుండి 26 వరకూ ప్రతిరోజూ ఉదయం నగర సంకీర్తన ఒకరి ఇంట్లో, సాయంత్రం సంకీర్తన ఒకరి ఇంట్లో చేయడం జరిగింది. ఫిబ్రవరి 8న బాబా కేంద్రంలో ఏకనామం నిర్వహించడమైంది. ఫిబ్రవరి 15న శ్వేతగిరిలో ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేయడమైంది. శ్రీమతి మెహెర్ రజనీ (కాకినాడ) బాబా సందేశాలపై ప్రసంగించారు. ఫిబ్రవరి 22న ఆరంగిపేటలో ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేయడమైంది. స్థానిక మహిళా ప్రేమికులు 'మెహెర్ దర్శనం' పేరిట నాటిక ప్రదర్శించారు. శ్రీకాకుళం పట్టణంలోని ఫిబ్రవరి 25న కత్తెర వీధిలోని బాబా కేంద్రంలో తెల్లవారుఝాము 4.30 నుండి 132 కొవ్వొత్తులు వెలిగించాం. ఆ తదుపరి 5 గంటలకు ప్రార్థనలు చేసి, శ్రీమతి యల్. మంగ జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం మేళ తాళా లతో పల్లకిలో అవతారుడ్ని పుర వీధులలో ఊరేగించి, అనంతరం శ్రీమతి ధర్మాన భారతి కేంద్ర ఆవరణలో సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. పతాక విశిష్టత సో: భాస్కర్ తెలియజేశారు. మెహెర్ దర్బార్‌లో ఏర్పాటు చేసిన ప్రేమిక సహవాస్‌లో స్థానిక ప్రేమికులు భజన గీతాలను ఆలాపించారు. స్థానిక మెహెర్ విద్యావిహార్ డైరెక్టర్, శ్రీ బరాటం లక్ష్మణ రావు అవతారుని భగవద్వచనం గురించి ప్రసంగించారు. మెహెర్‌బాబా ప్రవచించిన ఆధ్యాత్మిక రహస్యాలు నేటి తరం యువతకు అందుబాటులో వుంచేందుకు స్థానిక బాబా కేంద్రం కృషి చేయాలన్నారు. శ్రీ ఆనంద్ కుమార్ "నిస్వార్థ సేవ" ఆవశ్యకతను హృద్యంగా వివరించారు. శ్రీ రంగ ప్రసాదరావు, శ్రీ సాయి వరప్రసాద్ సేవా కార్యక్రమాలలో భాగంగా స్థానిక బెహరా మనో వికాస్ కేంద్రం, స్థానిక వృద్ధాశ్రమంలో వున్న వయోధికులకు ఉచిత వైద్య సేవలు, దుప్పట్లు, బాబా ప్రసాదంగా పండ్ల పంపిణీ చేశారు,

## కాశీబుగ్గ పలాసలో

ఫిబ్రవరి 25న ఉదయం 5 గంటలకు జన్మదిన వేడుకలు, విశ్వాత్మక ప్రార్థనలు, తదుపరి నగర సంకీర్తన నిర్వహించడమైంది. ఉ. 7. 30 నిమిషాలకు డాక్టర్ కణితి కేశవరావు గారు, టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సప్తవర్ణ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రేమిక సహవాస్‌లో శ్రీ డోలక్ రమేష్ బాబా సందేశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమాలలో కేంద్ర అధ్యక్షులు శ్రీ తేజేశ్వర్‌రావు, కార్యదర్శి శ్రీ రవి కుమార్, ట్రెజరర్ శ్రీ దుర్గారావు, శ్రీ కె. రమేష్, శ్రీ ఎ.చక్రవర్తి, శ్రీ కుమారస్వామి, సుధరాణీ, సుకన్య, మూత్యలమ్మ, గుణ తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మెహెర్ నగర్, కరీంనగర్ కేంద్రంలో

ఫిబ్రవరి 24 సా. 6 నుండి 9 వరకూ ప్రేమిక సహవాస్ నిర్వహించి, ఫిబ్రవరి 25 ఉదయం 5 గంటలకు బాబా జన్మదిన కాలంలో అవతారుని జయజయధ్వానాల నడుమ కేక్ ను కట్ చేసినట్లు కార్యదర్శి శ్రీ కిషన్ రావు, అడ్వకేట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు ధుని ప్రజ్వలన, ఆ పిదప సప్తవర్ణ పతాకావిష్కరణ, ప్రార్థనలు ఆరతి, ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు.

## నర్సీపట్నం కేంద్రంలో

ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో బాబా ప్రేమికుల సమక్షంలో ఉదయం 04.30 గంటలకు బాబావారి ప్రార్థనలు, సంకీర్తనలు, మౌనం పాటించి ఉదయం 5 గంటలకు మెహెర్ ప్రభువుకి మనసు హారతి ఇచ్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం బాబావారి చిత్రపటంతో పురవీధులగుండా ఊరేగింపు, సప్తవర్ణ పతాకావిష్కరణ, 10 గంటల నుండి సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నర్సీపట్నం సిస్టర్స్ శ్రావ్యంగా బాబా భజన గీతాలను ఆలాపించారు. శ్రీ కొండలరావు, విశాఖపట్నం బాబా సందేశాలపై ఉపన్యసించారు. శ్రీ కొల్లి రామారావు కార్యక్రమాన్ని నిర్వహించారు. మ.1 గంటకు బాబాకు హారతి ఇచ్చి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది. పలువురికి బాబా చిత్రపటాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి నాగమణి, శ్రీ పూళ్ళ సత్యనారాయణ, శ్రీ నాయుడు మాస్టర్, శ్రీ బుల్లబ్బాయి, శ్రీఅప్పారావు తదితరులు నూరుమందికి పైగా పాల్గొన్నారు.

## విజయవాడలో

ఫిబ్రవరి 4 నుండి 25 వరకు విజయవాడ కేంద్రంలో బాబావారి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రారంభ వేడుకలో శ్రీ తిరుమలశెట్టి శోభన్‌బాబు సప్త వర్ణ పతాకావిష్కరణ చేసి బాబా సందేశాలపై ప్రసంగించారు. తదాదిగా, ఫిబ్రవరి 24వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8 వరకు సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించడమైంది. ఈ 21 రోజుల్లో డాక్టర్ మెహెర్ ప్రసన్న, శ్రీ తాడేపల్లి ప్రసన్నకుమార్, శ్రీ దుర్గా ప్రసాద్, ఉయ్యూరు, శ్రీమతి తాడేపల్లి శ్యామల మచిలీపట్నం, శ్రీ ఉమా మహేశ్వర్‌సింగ్, హైదరాబాద్, శ్రీమతి శ్రీలక్ష్మి, శ్రీ వెంకట శేషయ్య, శ్రీమతి వై. విద్యావతి, బెంగళూరు, శ్రీ జయసూర్య, హైదరాబాద్, శ్రీ చక్కా హరనాథ్, చి. షణ్ముఖ ప్రియ, బాబా సత్య ప్రేమ సందేశాలపై ప్రసంగించారు. బాబా జన్మదినమైన ఫిబ్రవరి 25న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు కార్యదర్శి శ్రీ చింతా సర్వారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# తాడేపల్లిగూడెం, రామారావుపేట బాబా కేంద్ర 24వ వార్షికోత్సవం



**తాడేపల్లిగూడెం, రామారావుపేట బాబా కేంద్ర 24వ వార్షికోత్సవం, బాబావారి జన్మదిన** వేడుకలను ఫిబ్రవరి 25న వైభవంగా జరుపుకున్నట్లు అధ్యక్షులు డాక్టర్ వై. విజయసారధి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెల్లవారుఝామున 4.30 నుండి రాత్రి 9.30 వరకూ బాబా నామ స్మరణతో పలు కార్యక్రమాలు ముఖ్యంగా బర్త్ డే కేక్ కటింగ్, నగర సంకీర్తన, సప్తవర్ణ పతాకా విష్కరణ, పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పేదలకు వస్త్ర దానం నిర్వహించినట్లు విజయసారధి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కూనపరెడ్డి జయ నాగ సతీష్, శ్రీ కోట్ల మెహెర్‌బాబా, శ్రీ కలిగొట్ల సాయి మనోజ్ ప్రభాకర్, శ్రీ గొల్లపూడి జగన్మోహనరావు, శ్రీమతి మునగాల పుష్పావతి తదితరులు చురుకుగా పాల్గొన్నారు. సినిమా నటుడు శ్రీ ఎన్నారపు వెంకటేశ్వర్లు, మెహెర్‌బాబా పాత్రలో లఘు నాటికనొకదాన్ని హృద్యంగా ప్రదర్శించారు. ప్రార్థనలు, ఆరతి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

## రామాయంపేట

**రామాయంపేట బాబా కేంద్రంలో అవతారుని జన్మదిన వేడుకలు ఫిబ్రవరి 25** తెల్లవారుఝామున 4.30 నుండి రాత్రి 8.30 వరకూ నిర్వహించినట్లు శ్రీ కొక్కొండ రామచందర్ తెలిపారు. నగర సంకీర్తన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాబా సందేశాలపై ప్రసంగాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## వరంగల్లు

**వరంగల్లు బాబా కేంద్రంలో బాబా జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నామని** ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నిరుపేద కూలీలకు అన్నదానం చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ పాశికంటి రవికుమార్, శ్రీ జంగం రామ్‌కుమార్, శ్రీ పాల ఏకాంబరం, శ్రీ కొలిపాక సురేష్, శ్రీమతి శీలా రాధ, శ్రీమతి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్

**నిజామాబాద్ బాబా కేంద్రంలో అవతారుని జన్మదిన వేడుకలు ఫిబ్రవరి 25 తెల్లవారు** ఝామున 4.30 నుండి రాత్రి 8 వరకూ పలు ప్రత్యేక కార్యక్రమాలతోపాటు, నగర సంకీర్తన, సప్తవర్ణ పతాకావిష్కరణ, బాబా సందేశాలపై ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించినట్లు కార్యదర్శి తెలిపారు

## కరీంనగర్, సాయినగర్

**బాబా కేంద్ర ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 నుండి 25 వరకూ బాబా జన్మదిన వేడుకలను** వైభవంగా జరుపుకున్నట్లు శ్రీ నారోజు లక్ష్మీ నరసింహారావు తెలిపారు. ఫిబ్రవరి 25వ తేది ఉదయం 4 నుండి 8 వరకూ “సచ్చితానంద పరమానంద” నామ సంకీర్తన చేసి, సప్తవర్ణ పతాకావిష్కరణ చేశాం. ఆ రోజు సాయంత్రం 6 నుండి 10 వరకూ ప్రత్యేక సహవాస్ కార్యక్రమం నిర్వహించడమైంది. సుమారు 350 మంది భక్తులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి & శ్రీ రేనీకంట్ల వినయకుమార్ (యు.ఎస్.ఏ), శ్రీ రమేష్, శ్రీ నారోజు దిలీప్ రావ్, అలాగే కళాకారులు శ్రీ సిహెచ్ వాసుదేవరావు, శ్రీ సతీష్, శ్రీ కె.పి.చారి, శ్రీ రమేష్, శ్రీ రొడ్డ రవి, శ్రీ సిహెచ్ రాజేందర్ తదితరులు ఉత్సాహంగా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

**ధర్మవరం, నరసరావుపేట, వర్ని, సంగారెడ్డి, అనకాపల్లి, తదితర అనేక తెలుగునాట గల బాబా కేంద్రాలలో బాబా జన్మ దిన వేడుకలు ఫిబ్రవరి 25 తెల్లవారు**ఝామున 4.30 నుండి మ. 2 వరకూ పలు ప్రత్యేక కార్యక్రమాలతోపాటు, నగర సంకీర్తన, బాబా సందేశాలపై ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించినట్లు భోగట్టా.

## బాబా కేంద్రాలకు ఉచితంగా

**మెహెరీశం పార్ట్ 1 పార్ట్ 2 పుస్తకాలను తెలుగునాట గల నూరు బాబా కేంద్రాలకు ఇటీవల “బాబా ప్రేమ కానుకగా” అందజేయడమైంది. మెహెరీశం నిత్య పఠనీయం. ఈ గ్రంథాలను ఆయా బాబా కేంద్ర గ్రంథాలయాల్లో పాఠకులకి అందుబాటులో వుంచవల్సిందిగా కోరుతున్నాం. హైదరాబాద్‌లోని బాబా ప్రేమికులొకరు, అలాగే, బెంగళూరు, జయానగర్ కేంద్రంవారు మెహెరీశం రెండు సంచికలను నూరు బాబా కేంద్రాలకు అందజేసేందుకు సహకరించారు. వారిద్దరికి ధన్యవాదములు. జైబాబా.**

***



# బాబాలో ఐక్యం

**విశాఖ ప్రేమికులు శ్రీ చెట్టు రామక్రిష్ణ గారి భార్య శ్రీమతి** ఇందిరమ్మ, 2026 ఫిబ్రవరి 12, గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో బాబా నామస్మరణతో అవతారునిలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు.

# వేసవిలో మెహెరాబాద్

**ఈ ఏడాది ఎండాకాలం దృష్ట్యా, డి - హాస్టలు - 2026 మార్చి 15 నుంచి ఏప్రిల్ 30 వరకూ, అలాగే, యంపిఆర్ మే 1 నుంచి జూన్ 14 వరకూ మూసి వుండును. మెహెరాజాద్ - మార్చి 16 నుండి జూలై 1 వరకూ సందర్శకులకు అనుమతి లేదని ట్రస్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.**

# జూబ్లి - 24వ ధుని వార్షికోత్సవం

**జూబ్లి హిల్సు బాబా కేంద్రంలో 24వ ధుని ప్రజ్వలన వార్షికోత్సవం 2026 మార్చి 12న గో ధూళి వేళ నిర్వహించినట్లు శ్రీ మెహెర్ చంద్ నోరి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన అన్నారు.**

# పరేల్ సెంటర్ 38వ వార్షికోత్సవం

**పరేల్ సెంటర్ 38వ వార్షికోత్సవం 2026 మార్చి 6న ఘనంగా నిర్వహించినట్లు శ్రీ జల్లు వెంకట్ మెహెర్ ఒక ప్రకటనలో తెలిపారు. భజన గీతాలు, బాబా సందేశాలపై వక్తల ప్రసంగాలు, ప్రార్థనలు, ఆరతితో కార్యక్రమం ముగిసిందని ఆయన అన్నారు.**



# భగవత్ప్రేమ ఎలా వుండాలి?

**ఈ ప్రేమ ఆషామాషీగా వుండకూడదు. భగవత్ప్రేమ ఝరిలో అహంకారం కొట్టుకు పోవాలి.** అహంకారాన్ని సమూలంగా తుడిచిపెట్టే స్థాయిలో వుండాలి మీ ప్రేమ అన్నారు బాబా. భగవత్ప్రేమ మత్తులో మిమ్మల్ని మీరు మరచిపోవాలి. ప్రాపంచిక స్పృహ పోవాలి. ఈ దివ్యానుభూతి మీకు కోరికలు లేకుండా చేస్తుంది. కళ్ళు చెదిరి తళతళ మెరుస్తాయి. తల తిరుగుతుంది. తన్మయత్వంలో పడతారు. నిజమైన ప్రేమ అంటే అదేనని బాబా వివరించారు.

**ఇంకోమాట శెలవిచ్చారు. భగవంతుని చూడాలనుకోవటం, భగవంతుడి గురించి తెలుసుకోవా** లనుకోవడం ఇవీ నిజమైన ప్రేమ. ఈ దైవీ ప్రేమ స్వతహాగా పుట్టదు. అదొక వరప్రసాదం. గురువు కృప వల్ల సంప్రాప్తిస్తుందీ ప్రేమ వరం. గురు కృప అందరికీ దొరకదు. బహుకొద్ది భాగ్యశాలురకే సిద్ధిస్తుందీ వరం. అసలు సిసలు భగవత్ప్రేమ నాకు లేదే అని నిరాశపడవద్దు. మీ అందరికీ నాపై గురి వుంది. నేనంటే నమ్మకం వుంది. మీరేం చేయాలి? నేను నిరంతరం గుర్తుండేలా సదా ప్రయత్నించండి. నా గురించి మాట్లాడండి ఎల్లప్పుడూ. అలాచేస్తే అదొక శుభారంభం అవుతుంది. గురుకృప ప్రాప్తికి సంసిద్ధులు కావాలన్న మీ దీక్షకి శ్రీకారం అవుతుంది. ఇది కొనసాగితే, మీరు ఎదురుచూస్తున్న శుభ దినం వస్తుంది. నా అత్యున్నత బహుమానం మీ సొంతం అవుతుంది. నన్ను స్మరించండి. మీ గుండెలో నా నామం మారు మ్రోగాలి. హృదయాంతరాళల్లో నా నామం గాఢంగా నాటుకు పోవాలి. అప్పుడే నా ప్రేమ కృపా సిద్ధికి సిద్ధమవుతారన్నారు బాబా.

## మా వల్ల సాధ్యమా?

**ఇదంతా మా వీలవుతుందా, ఏదో రోజూ పొట్టకూటికి నానా తిప్పలు పడుతున్నాం. భగవన్నామం** చేస్తూ కూర్చుంటే, పొట్ట నిండుతుందా ఏమన్నానా? పైపెచ్చు నలుగురూ నవ్వుతారు. దేముడి పిచ్చి పట్టిందని హేళన చేస్తారు. మీ ఆంతర్యం నాకు తెలియందా అన్నట్లు బాబా వో తరుణోపాయం చెప్పారు. ఇదే తారక మంత్రం అన్నారు. మీరు చేయాల్సింది ఏమీ లేదు. ఏ పని మొదలుపెడ్తున్నా నన్ను స్మరించి మరీ మొదలు పెట్టండి మీ పని. అలానే పని పూర్తి అయ్యాక, నన్ను గుర్తుచేసుకోండి. ఏదైనా వ్రాయాల్సి వచ్చింది అనుకోండి. నన్ను స్మరించండి. బాబా! నువ్వేనయ్యా వ్రాస్తున్నది నేను కాదు అనుకొంటూ కలం చేతపట్టండి. ఇలా ఏపని చేస్తున్నా సరే, పరీక్ష వ్రాస్తున్నా సరే, ఆ భారం నాపైనే వేయండి అని చెప్పారు. నిమిత్తమాత్రుమన్న భావనతో పని చేయాలన్న దివ్యోపదేశాన్ని చెప్పకనే చెప్పారు.

**వ్రాసెడిది భాగవతంబంట. వ్రాయించెడివాడు రామభద్రుండట. ఇది అక్షరసత్యం.**

# జూబ్లీలో మహిళా ప్రేమిక సహవాస్
## 2026 మార్చి 8



**జూబ్లి బాబా కేంద్రంలో మహిళా ప్రేమిక సహవాస్ మార్చి 8వ తేది నిర్వహించారు.** మహిళలు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు బాబా సందేశా లపై ప్రసంగించారు. భజన గీతాలు ఆలాపించారు. ఏకపాత్రాభినయం, లఘు నాటికలను ప్రదర్శించారు. బాబా నామస్మరణతో ఆద్యంతం హృద్యంగా సుమారు రెండు గంటల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్త్రీ మండలి సభ్యులైన డాక్టర్ గోహెర్, మన్సారి మాయి, మణిజా, మెహెరామాయి, అలాగే అవతారుని ఆధ్యాత్మిక తల్లి శ్రీమతి గుల్మాయి, బాబావారి తల్లి షిరీన్ మాయి మెహెరుని ప్రేమలో తరించిన వైనాన్ని వివరించారు.

# మానవ సేవా ప్రాజెక్ట్, మెహెరాబాద్

**నిరాశ్రయులు, అనాథలు, మానసిక రోగులను ఈ సంస్థ తమ అక్కున చేర్చుకుని, వారికి** పునరావాసం కల్పిస్తోందని సంస్థ వ్యవస్థాపకులు శ్రీ దిలీప్ వసంత్ గుంజాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థ ద్వారా ఇప్పటి వరకు సుమారు 3 వేల మందికిపైగా శాశ్వత పునరా వాసం కల్పించినట్లు తెలిపారు. కాగా, ప్రస్తుతం సంస్థలో 100 మంది లబ్ధిదారులు వున్నారని అన్నారు. వీరి కోసం ఒక అత్యాధునిక భవన నిర్మాణం చేపట్టి ప్రారంభించినట్లు, ఈ భవన నిర్మాణంలో సహకరించిన శ్రీమతి కోకా తులసి కుమారి, మెహెరాబాద్, ఉచిత రీతిన సన్మానించినట్లు తెలిపారు.

ఈ సేవా సంస్థ మెహెరాబాద్ (ఆరంగాం) – సోనేవాడి శివార్లలో బై పాస్ రోడ్డులో, జంగల్ ఫాం హౌస్ వెనుక వుంది. మానవ సేవా ప్రాజెక్టులో వుండి సేదతీరుతున్న పేదలకు తగు రీతిలో సహాయపడదల్చినవారు, సంస్థ ప్రతినిధి ఫోన్. 99606 08778 సంప్రదించవల్సిందిగా కోరుతున్నారు.

## సాయి నిఖిల్ వివాహం

**శ్రీమతి యస్. నర్మద & శ్రీ శ్రీనగేష్, బెంగళూరు గారి కుమారుడు చి. సాయి నిఖిల్ వివాహం** చి.ల.సౌ. వైష్ణవి ఘంటశాలతో 2026 ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లోని హె.ఐ.సి.సి.లో ఘనంగా జరిగింది. ఆ తర్వాత ఫిబ్రవరి 28న బెంగళూరులోని మాణిక్య ఛామర వజ్రలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. బాబా ప్రేమికులు పలువురు వివాహానికి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.

## గూటూరు వారింట వివాహం

**శ్రీమతి గూటూరు మెహెర్ లీల శ్రీ శివరామ ప్రసాద్, సికింద్రాబాద్ గారి కనిష్ఠ పుత్రుడు** డాక్టర్ ఆదిత్య వివాహం డాక్టర్ శ్రీ తనూజతో కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో 2026 మార్చి 5న జరిగింది. కాగా, మార్చి 7 సా. 7 నుండి సికింద్రాబాద్‌లోని కొంపల్లిలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. బాబా ప్రేమికులు పలువురు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

## కంకల్ కేంద్ర 45వ వార్షికోత్సవం

**కంకల్ కేంద్ర 45వ వార్షికోత్సవం మార్చి 8న వైభవంగా జరుపుకున్నట్లు భోగట్టా.** ఉ. 7 నుండి సా.4 వరకూ నగర సంకీర్తన, సప్తవర్ణ పతాకావిష్కరణ, బాబా సందేశాలపై వక్తల ప్రసంగాలతోపాటు బాబా నామస్మరణతో కూడిన భజన కార్యక్రమాలు నిర్వహించారు.



# అవతార్ మెహెర్‌బాబా ఎవరు?

**అవతార్ మెహెర్‌బాబా ఈ యుగావతారుడు. మానవరూపధారిగా వచ్చిన దేవ దేవుడు. మెహెర్‌బాబాను కలియుగావతారునిగా తమ ఇంటి ఇలవేల్పుగా ఆరాధించి, ప్రేమించేవారు మన దేశంలోనే కాక ప్రపంచ దేశాలలో ఎందరో ఉన్నారు. తెలుగువారి విషయానికి వస్తే వీరి సంఖ్య అసంఖ్యాకమనే చెప్పాలి. ఆ దేవదేవుని గురించి తెలుసుకోవాలనుకునేవారందరి కోసం నాలుగు మాటలు.**

## జననం

**మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పూణేలో జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు** మేర్వాన్. పూణేలోని డెక్కన్ కాలేజీలో చదువుకున్నారు. ఒక రోజున కాలేజీ నుండి వస్తుండగా వృద్ధ మహిళ సద్గురు హజ్రత్ బాబాజాన్ మేర్వాన్‌ను దగ్గరగా పిలిచి ముద్దాడింది. దాంతో మేర్వాన్ ప్రపంచ చైతన్యం కోల్పోయాడు. అనంతరం సద్గురువులు – బాబాజాన్, షిరిడి సాయిబాబా, ఉపాసనీ మహారాజ్, నారాయణ్ మహారాజ్, తాజుద్దీన్ బాబాలు మేర్వాన్‌ను సమస్త మానవాళిని అదుపుచేసే అవతార పురుషునిగా, భగవంతుని స్వరూపంగా తీర్చిదిద్దారు. షిరిడి సాయిబాబాను దర్శించుకోవడానికి తొలిసారిగా వెళ్ళిన మేర్వాన్‌ను చూసిన సాయిబాబా “ఓ పర్వర్దిగార్” అని సంబోధించారు. ‘ఓ లోక రక్షకా!’ అని ఆ మాటకు సమానార్ధంగా చెబుతారు. ఈ విషయం సాయి సచ్చరిత్రలో కూడా స్పష్టంగా ఉందని సాయిభక్తులు పేర్కొంటారు. అనంతరం మేర్వాన్‌ని ఆయన శిష్యులు మెహెర్‌బాబాగా పిలవనారంభించారు. మెహెర్‌బాబా అంటే ‘దయ గల తండ్రి’ అని తెలుగులో సమానార్ధంగా చెప్తారు.

## మౌనం

**మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి 1969 జనవరి 31న ఆయన భౌతిక దేహం వదిలేదాకా అంటే సుమారు 44** సంవత్సరాల కఠిన మౌనంలోనే ఉన్నారు. అప్పటికి ఆయన వయస్సు కేవలం 30 సంవత్సరాలు. క్షణంసేపు ఎవ్వరితో మాట్లాడకుండా ఉండటమే అసాధ్యంగా భావించేవారికి, నాలుగు దశాబ్దాలకు పైగా మౌనంతో ఉండటం సాధ్యమౌతుందా? మౌనంగా ఉంటూనే భగవన్నామం వైపు దృష్టి సారించేందుకు అవసరమైన అనేక అంశాలతో కూడిన పలు గ్రంథాలు మెహెర్‌బాబా రచించారు. అందులో God Speaks, Everything and Nothing, Meher Baba’s Discourses ముఖ్యమైనవి. ఈ గ్రంథాలు నేడు ఇంగ్లీషుతో పాటు తెలుగు, హిందీ తదితర భాషల్లో కూడా లభిస్తున్నాయి.

## 'ప్రేమ' – తన మతం

**గత అవతారాలలో తాను శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా, ఏసు ప్రభువుగా, బుద్ధుడిగా, ప్రస్తుత కాలంలో అవతార్ మెహెర్‌బాబాగా** మానవరూపధారియైన భగవంతునిగా అవతరించానని మెహెర్‌బాబా పలు సందర్భాలలో ప్రకటించారు. ఈ అవతారకాలంలో మెహెర్‌బాబా తాను ప్రత్యేకంగా ఎలాంటి మతం స్థాపించరాలేదని, అన్ని మతాలు ఒక్కటేనని, తన మతం "ప్రేమ మతం" అని ప్రకటించారు. ప్రతివానిలో భగవంతుడున్నాడు. కాబట్టి మీ ఎదుటి వ్యక్తిలోని ఆ దైవాన్ని దర్శించుకుని ప్రేమతో హాయిగా సంతోషంగా ఉండమన్నారు. భగవంతుడిని ఎలా ప్రేమించాలనే విషయమై వివరిస్తూ, నీ తోటి వారిని హృదయపూర్వకంగా ప్రేమించమన్నారు. ఎదుటివారిలోని తప్పొప్పులు ఎంచవద్దు. అలాగే ఎదుటివాడిని దోచుకుని నీవు లాభపడాలనుకోవద్దు. నీకు వీలైతే, కష్టాల్లో ఉన్నవారికి నీ శాయశక్తులా సహాయపడటానికి ప్రయత్నించు అని, మెహెర్ బాబా పలు సందర్భాలలో ఎంతో సున్నితంగా, సరళంగా వుండే సందేశాలను తన ప్రేమికులకు అందజేశారు. సాధారణంగా భక్తులు భగవంతుడిని ప్రార్థించి తమ కోర్కెలు తీర్చమని కోరుకుంటారు. అదే భగవంతుడిని హృదయపూర్వకంగా ప్రేమించి ఆరాధించేవారు ఎలాంటి కోర్కెలు లేకుండా భగవంతుని ఇష్టప్రకారం వినమ్రత, విధేయతతో నడుచుకోవాలని కోరుకుంటారు. అందుకనే మెహెర్‌బాబాను ఆరాధించేవారు చాలామంది తమను బాబా భక్తులుగా కంటే మెహెర్‌బాబా ప్రేమికులమని చెప్పుకుంటారు.

**మెహెర్‌బాబా సందేశాలను నూటికి నూరు శాతం ఆచరణలో, విధేయతతో అమలుపరిచిన బాబా ప్రేమికులు ఎందరో** ఉన్నారు. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో చిన్న గుట్టపై మెహెర్‌బాబా ప్రార్థనాలయం ఉంది. చక్కని ఆర్కిటెక్చర్‌తో నిర్మించిన ఈ ఆలయం నిత్యం భక్తులకు స్వాగతం పలుకుతుంది. హైదరాబాద్‌లోని కోఠి మహిళా కళాశాల సమీపంలో అలాగే, తెలుగు రాష్ట్రాలలోని అనంతపురం నుండి ఆదిలాబాద్ దాకా అన్ని పట్టణాలలో, పలు పల్లెల్లో మెహెర్‌బాబా ప్రార్థనా కేంద్రాలున్నాయి. మెహెర్‌బాబా సమాధి మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్‌కి 5 కి.మీ. దూరంలో మెహెరాబాద్ అనే ప్రాంతంలో ఉంది. ప్రతిఏటా జనవరి 31న మెహెరాబాద్‌లో అమరతిథి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. మెహెర్‌బాబా మౌనం ప్రారంభించిన జూలై 10న తన భక్తులందర్నీ భగవంతుని ధ్యానంలో మౌనంగా గడపమని బాబా ఆదేశించారు. మెహెర్‌బాబా ప్రవచనాలు నేటి సమాజానికి ఎంతో అవసరం. మనిషికి మనిషికీ గిట్టని ఈ కాలంలో, ఆ మహనీయుని 'ప్రేమతత్వం' నేటి తరానికి ఎంతో అవసరం.

***

# మా ప్రచురణలు


ధన్యచరితులు
బాబా సేవ - ప్రేమలో తరించిన తూర్పు - పశ్చిమ ప్రేమిక మండలి సభ్యులు
డాక్టర్ మల్లాది కృష్ణానంద్


దేవుని సన్నిధిలో
శ్రీ అవతార్ మెహెర్‌బాబా
తెలుగు సేత
డాక్టర్ మల్లాది కృష్ణానంద్


సార్థకజన్ములు
తెలుగు సేత
మల్లాది కృష్ణానంద్


సర్వధర్మాన్ పరిత్యజ్య.,
కేశవ్‌జీ ఆత్మకథ
మల్లాది కృష్ణానంద్


త్వమేవ శరణమ్
(మా అందరికీ నీవే రక్ష)
డాక్టర్ మల్లాది కృష్ణానంద్


మెహెరీశం
రాం సింగ్ కల్యూరి


మెహెరీశం
1929 -1931
సంచిక -2
రాం సింగ్ కల్యూరి


మెహెరాబాద్ సహవాస్
1958 ఫిబ్రవరి 14 నుండి 26 వరకు
- డాక్టర్ మల్లాది కృష్ణానంద్


న మే భక్తః ప్రణశ్యతి
(నా భక్తునికి ఎలాంటి నష్టము, కష్టము ఉండదు)
అవతార్ మెహెర్‌బాబా
మల్లాది కృష్ణానంద్


మెహెర్‌బాబా సన్నిధిలో జీవిత కథా మంజరి
సద్యః ఫలితం
"తక్షణ ఫలితం" లభిస్తుంది
డాక్టర్ మల్లాది శారద


LIFE CIRCULARS
of
AVATAR MEHER BABA
(A COMPILATION OF 71 CIRCULARS)

# తెలుగునాట అవతారుని జన్మదినోత్సవం






గాజువాక




విజయవాడ



కరీంనగర్, సాయినగర్



బందరు

## జీవిత సభ్యత్వం / అదనపు జీవిత సభ్యత్వం
**2026 ఫిబ్రవరి - మార్చి నెలలలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీ నాగేంద్ర ప్రసాద్, విశాఖపట్నం | రూ. 2000/- |
| 2. | శ్రీమతి యం. పుష్పావతి, తాడేపల్లిగూడెం | రూ. 2000/- |
| 3. | శ్రీ కె. గంగాధర్, నిజామాబాద్ | రూ. 2000/- |
| 4. | డాక్టర్ యం. కరుణాకర్, నెల్లిమర్ల, విజయనగరం జిల్లా | రూ. 1000/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

### మా అడ్రస్:


**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**

**బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం. 32,

జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.

**ఫోన్: 99595-53218.**

**email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Caxton Printers, Lakdi-ka -Pul, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**